
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు
జిల్లా వార్తలు
5
ఆదివారం 18 ఫిబ్రవరి 2024




సభకు హాజరైన జనసందోహం


సైకిల్ చిహ్నం చూపిస్తున్న ఓ పెద్దాయన


మహిళల ఉత్సాహం

గెలుపు మనదే..

ఇక ఫ్యాన్ రెక్కలు ముక్కలే



- రాష్ట్రంలో టీడీపీ, జనసేన సునామీ
- పర్చూరు రాజకీయం రాష్ట్రానికే కేస్‌స్టడీ
- రా.. కదలి రా సభలో టీడీపీ అధినేత చంద్రబాబు

ప్రభుత్వ అవాంతరాలు ఎదిరించి.. పోలీసుల ఆంక్షలు అధిగమించి.. జనసంద్రం ఇంకొల్లుకు తరలివచ్చింది. భారీగా జనం తరలివచ్చిన బహిరంగ సభలో మీ కోసం వచ్చా.. మీ వెంటే ఉంటా అంటూ టీడీపీ అధినేత చంద్రబాబు అభయం ఇచ్చారు. సీఎం జగన్ నుంచి వైసీపీ నేతల అక్రమాలపై సెటైర్లు వేస్తూ, జగన్‌రెడ్డి వైఫల్యాలను ఎండగడుతూ, అక్రమాలను మననం చేస్తూ చంద్రబాబు చేసిన ప్రసంగం సభికులను ఉర్రూతలూగించింది. బాపట్ల పార్లమెంట్ పరిధిలోని 7 నియోజక వర్గాల్లోని అక్రమాలను ఎండగడుతూ, నేతలకు చురకలు అంటిస్తూ, అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే హామీలను వివరించారు. ఎన్నికలకు పార్టీ శ్రేణు లు సిద్ధంగా ఉండాలని పిలుపిచ్చారు.

చీరాల, ఫిబ్రవరి 17: గెలుపు మనదే.. అనుమానం లేదు.. ఉమ్మడి అభ్యర్థులను గెలిపించండి.. మీ కోసం పనిచేస్తా.. రాజకీయాన్ని కలుషితం చేసిందెవరో తెలుసుగా.. అతడ్ని సాగనంపుదాం. ఇక మిగిలింది 52 రోజులే. కౌంట్ డౌన్ స్టార్టయ్యింది. ఇక ఫ్యాన్ రెక్కలు ముక్కలు ముక్కలే.. తెరలు కట్టుకుని తిరగడం కాదు.. పర్చూరు పౌరుషం చూడు జగన్‌రెడ్డి. సభకు వచ్చిన జనసంద్రాన్ని టీవీలలో చూడు. చూస్తే రాత్రికి నిద్ర కూడా రాదు. నీ డబ్బు సంచులు, అక్రమ కేసులతో ఎవరినీ ఆపలేవు.. అని బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గం ఇంకొల్లులోని తారక రామ విజయభేరి ప్రాంగణంలో జరిగిన రా.. కదలి రా సభలో టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. శనివారం టీడీపీ బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అధ్యక్షతన నిర్వహించిన సభకు ముఖ్య అతిథిగా చంద్రబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు. సీఎం జగన్ పెట్టే ప్రతీ స్కీం వెనుక ఓ స్కాం ఉంటుంది. ల్యాండ్, శాండ్, మైన్, వైన్ ఇలా ప్రతి అంశంలో వైసీపీ ప్రభుత్వానిది అక్రమార్జనే. సహజ వనరులను దోపిడీ చేసి సీఎం జగన్ తన ఆస్తులు పెంచుకున్నాడు. రాష్ట్ర ప్రజలను బాధితులను, పేదల ను చేశాడని ధ్వజ మెత్తారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరు సైకో బాధితులే. అందులో నేను ఉన్నాను.. పవన్‌కళ్యాణ్ ఉన్నారు.. ప్రజలందరు కూడా ఉన్నారని చంద్రబాబు వివరించారు.

పర్చూరులో పాలకపార్టీ చేసిన అక్రమాలు రాష్ట్రానికి కేస్ స్టడీ. విధ్వంసం, దొంగ ఓట్లు, అక్రమ కేసులు ఇలాంటివి ఎన్నో చేశారు. ఓట్లు తొలగించడానికి దాదాపు 14,000 ఫాం 7లు దరఖాస్తు చేశారు. తాడేపల్లిలో పెద్ద సైకో ఉంటే ఇక్కడ చిన్న సైకో ఉన్నారు. 2019లో చీరాలలో ఛీకొట్టిం చుకున్న వ్యక్తి ఇక్కడ దొంగ ఓట్లు చేర్చడం, గ్రానైట్ వ్యాపారులపై అక్రమ కేసులు బనాయించాడు. ఆ బకాసురుడ్ని కాదని మరొకతన్ని తెచ్చారు. ఎవరు వచ్చినా ఇక్కడ సాంబశివరావు గెలుపును ఆపలేరు. తనిఖీల పేరుతో అధికారుల వాహనాల్లోనే కారం, కర్రలు తీసుకువచ్చారు. వాటిపై సాంబశివ రావు పోరాడారు. గ్రానైట్ కేసులపై అద్దంకిలో ఎమ్మెల్యే రవికుమార్ సుప్రీం కోర్టు వరకు వెళ్లి పోరాడారు. కొండేపి ఎమ్మెల్యే బలావీరాంజనేయస్వామి సంతనూతలపాడు ఎమ్మెల్యేపై అసెంబ్లీలో ధీటుగా వ్యవహరించారు. ప్రతి నాయకుడు ఇలానే పోరాడాలి.

వైసీపీ నేతలకు చురకలు

- వేమూరులో మంత్రి అక్కడ చెత్త, సంతనూతలపాడులో ఏమవుతాడు. అక్కడ కూడా చెత్తే కదా. ఆ చెత్తను ఎక్కడకు పంపాలి డంపింగ్ యార్డుకు కదా. ఇసుక అక్రమాలలో రూ.100 కోట్లుపైగా సంపాదించాడు.
- చీరాలలో 2019లో మనం గెలిపించిన దుర్మార్గుడు కష్టాల్లో వెళ్లిపోయాడు. మరలా గెలిపిస్తే మన దగ్గరకు వస్తామంటున్నారు. మనం నమ్ముతామా.
- రేపల్లెలో మోపిదేవి ఇక శాశ్వతం గా పేకాట ఆడుకోవడమే.
- బాపట్లలో కోనది కోట్లు కొల్లగొట్టిన ఘనత. కోన రఘుపతి కమర్షియల్ రఘుపతిగా మారాడు. ఇంటి పర్మిషన్, రియల్ ఎస్టేట్ వెంచర్ వేయాలన్నా డబ్బు చెల్లించాల్సిందే.
- బాపట్ల ఎంపీకి చెరుకుతోటలు కాల్చడం, కబ్జాలు, బెదిరింపులు, మట్టి, గ్రావెల్ దోపిడీ మాత్రమే తెలుసు.

చంద్రబాబుది పాలనా దక్షత

గతంలో కొమ్మమూరు, సాగర్ కాలువలకు తక్కువ నీరున్నప్పుడు కూడా రైతులు ఎక్కువ పంటలు పండించారని, అది చంద్రబాబు పరిపాలన దక్షతకు నిదర్శనమని ఏలూరి సాంబశివరావు తెలిపారు. ఇప్పుడు వాటర్ నోటిఫికేషన్ కూడా ఇవ్వకుండా రైతులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. రా.. కదలి రా సభ జరగకుండా అనేక కుట్రలు చేశారని వాటన్నింటిని ఎదుర్కొన్నామన్నారు. తాడికొండ, అద్దంకి, రేపల్లె ఎమ్మెల్యేలు ఉండవల్లి శ్రీదేవి, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, డోలా బాలవీరాంజనేయస్వామి, చీరాల, బాపట్ల, సంతనూతలపాడు నియోజకవర్గాల ఇన్‌చార్జిలు ఎం.ఎం కొండయ్య, వేగేశన నరేంద్రవర్మ, బి.ఎన్ విజయ్‌కుమార్, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, మాజీ ఎంపీ శ్రీరాం మాల్యాద్రి, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు రియాజ్, విజయ్ కుమార్ తదితరులు మాట్లాడుతూ వైసీపీ నియంత పాలనకు చరమ గీతం పాడదామన్నారు. జగన్‌కు టీడీపీ, జనసేన శ్రేణులు కుర్చీ మడత పెట్టాలని పిలుపునిచ్చారు. జగన్ రెడ్డిని సాగనం పేందుకు సైకిల్, గ్లాస్ గుర్తులపై బటన్ నొక్కాలన్నారు.


ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్


ప్రసంగిస్తున్న వేగేశన నరేంద్రవర్మ


ప్రసంగిస్తున్న మాజీ ఎంపీ శ్రీరాం మాల్యాద్రి

అందరి బాధ్యత నాదే..

అధికారంలోకి వచ్చాక అందరి బాధ్యత తీసుకుంటా. నేతన్నల కోసం టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేస్తా. చేనేత కార్మికులకు కేటగిరీని బట్టి 200 నుంచి 500 వరకు ఉచిత విద్యుత్ అందిస్తాం. అర్హులైన ప్రతి ఒక్కరికి రెండు సెంట్లలో ఇళ్లు కట్టిస్తాం. ఇంకొల్లుతో పాటు ముస్లిం సోదరులున్న చోట ఆటోనగర్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తాం. గండ్లకమ్మ మరమ్మతులు చేపడతాం. పర్యాటకంగా బీచ్‌లను అభివృద్ధి చేస్తాం. గ్రానైట్ పరిశ్రమకు పూర్వవైభవం తెస్తాం. గుం టూ రు ఛానల్ పొడిగింపు చేస్తాం. సాకి, ఆలేరు, రొంపేరుల పనులుతో పాటు, గోదావరి జలాలు సాగర్ రైట్ కెనాల్‌కు తరలింపు, కొమ్మమూరు కాలువ పనులు చేపడతాం. విదేశీ విద్య, పండుగ కానుకలు, అన్నా క్యాంటీన్‌లు కొనసాగుతాయి.


చంద్రబాబును సన్మానిస్తున్న ముస్లిం,ఇతర నాయకులు

వైసీపీ సభకు రైట్ రైట్


గుంటూరు బస్టాండ్‌లో సీట్ల కోసం ఎగబడుతున్న ప్రయాణీకులు


గుంటూరు బస్టాండులో బస్సుల కోసం ప్రయాణీకుల పడిగాపులు

- అనంత బాటలో ఆర్టీసీ బస్సులు
- డిపోల్లో ప్రయాణికుల పడిగాపులు
- బస్సులు కొరతతో ప్రయాణాలకు పాట్లు

గుంటూరు, నరసరావుపేట, వినుకొండ, ఫిబ్రవరి 17: వైసీపీ సేవకు ఆర్టీసీ సిద్ధమవగా.. ప్రయాణికులు గమ్య స్థానాలకు చేరుకునేందుకు తీవ్రంగా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అనంతపురంలో అధికార వైసీపీ సిద్ధం సభకు ఉమ్మడి జిల్లా పరిధిలోని డిపోల నుంచి బస్సులను తరలించారు. దీంతో డిపోల్లో బస్సులు లేక.. సామాన్యులు ప్రయాణాలకు పడిగాపులు కాయాల్సి వచ్చింది. డిపోల్లో కండీషన్‌లో ఉన్న బస్సుల్లో సగానికిపైగా అనంతపురంలో జరిగే వైసీపీ సభకు కేటాయించారు. దీంతో శనివారం ఉదయమే ఆయా బస్సులు అనంతపురానికి తరలివెళ్లాయి. బస్సులు అనంత సభకు వెళ్లడంతో బస్టాండ్‌లు ఖాళీ ప్లాట్ ఫామ్‌లతో వెలవెలబోయాయి. సీఎం జగన్ నిర్వహించే సభ కోసం ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి 292 సర్వీసులు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. విభజిత గుంటూరు జిల్లాలోని డిపోలతో పాటు పల్నాడులోని ఆరు డిపోలు, బాపట్ల జిల్లా నుంచి బస్సులను కూడా తరలించారు. వివిధ అవసరాల కోసం రాకపోకలు సాగించే ప్రయాణికులు గంటల తరబడి బస్టాండ్లలో పడిగాపులు కాయాల్సివచ్చింది. మరోవైపు ఉద్యోగులు నిర్దీత సమయానికి కార్యాలయాలకు వెళ్లేందుకు బస్సులు సకాలంలో లేక నరకయాతన పడ్డారు. గుంటూరు నుంచి బాపట్ల, పొన్నూరు, విజయవాడ వైపునకు, పల్నాడు, పర్చూరు రూట్‌లో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

పల్లెవెలుగు రూట్లలో నరకయాతన..

పల్లెవెలుగు రూట్లలో అరకొరగా సర్వీసులు ఉండటంతో ప్రయాణికులు నరకయాతన పడాల్సి వచ్చింది. అమరావతి, ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, తుళ్లూరు, పర్చూరు, తెనాలి, నరసరావుపేట, చిలకలూరిపేట రూట్లలో వెళ్లే పల్లె వెలుగు సర్వీసులను ఏర్పాటు చేయలేకపోయారు. బస్సు ఎక్కేందుకు తోపులాటకు దిగిన పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో అరకొర బస్సులు కిటకిటలాడాయి. దీంతో ప్రయాణికులు ప్రత్యక్ష నరకం చవి చూశారు. ఆర్టీసీ తీరుపై ప్రయాణికులు మండిపడ్డారు. ఆర్టీసీ బస్సులను అనంతపురం సీఎం సభకు ఏర్పాటు చేసి తమను ఇబ్బందులకు గురిచేయడం దారుణమని మండిపడ్డారు. వినుకొండ ఆర్టీసీ డిపో నుంచి మండలాల పరిధిలో రాత్రి పూట హాల్టింగ్ బస్సులను పూర్తిగా రద్దు చేసి, వాటిని అనంతపురం జిల్లా రాప్తాడుకు తరలించారు. వినుకొండ డిపోలో 60 బస్సులు ఉండగా వాటిలో 40 బస్సులు అనంతపురం జిల్లాకు తరలించడంపై ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిలకలూరిపేట డిపో నుంచి 23 బస్సులను అనంతపురానికి పంపించారు. గుంటూరు, చీరాల, మాచర్ల తదితర ప్రాంతాలకు బస్సు సర్వీసులు తగ్గి పోవటంతో ప్రయాణీకులకు తీవ్ర అసౌకర్యం కలిగింది. ఆది, సోమవారాల్లో కూడా బస్సులు ఉండవని సామాన్యులు ప్రయాణాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాల్సిన అవసరం ఉంది.

చేనేతల చింతలు.. ఇక చెల్లు

- ఆరోగ్యం, ఆదాయం అందించడమే టీడీపీ లక్ష్యం
- మంగళగిరి పర్యటనలో నేత కార్మికులకు బ్రహ్మణి హామీ

మంగళగిరి, ఫిబ్రవరి 17: చేనేత కార్మికులు వృత్తిపరంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించి, వారికి ఆరోగ్యంతోపాటు మంచి ఆదాయం అందించడమే లక్ష్యంగా టీడీపీ పనిచేస్తుందని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సతీమణి బ్రహ్మణి తెలిపారు. మంగళగిరిలో లోకేశ్ ఏర్పాటు చేసిన వీవర్స్‌శాలను శనివారం బ్రాహ్మిణి ప్రారంభించారు. ఈ సందర్భంగా మగ్గాల షెడ్లు, డైయింగ్ కేంద్రాలలోని స్థితిగతులు... అక్కడ వారు పడుతున్న ఇబ్బందులను గురించి తెలుసుకునేందుకు ఆమె క్షేత్ర పరిశీలన చేశారు. తొలుత ఆమె వీవర్స్‌కాలనీలోని గుంటి నారాయణకి చెందిన మగ్గాల షెడ్డును సందర్శించి నేత కార్మికులతో ముచ్చటించారు. పాతకాలం నాటి మగ్గాలతో కంటి సమస్యలతో పాటు ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని, భత్యాలు కూడా సరిపోవడం లేదని వాపోయారు. సొంతంగా మగ్గాలను సమకూర్చుకోలేక చేనేత పారిశ్రామికుల మగ్గాల షెడ్లలో కూలీకి నేత నేస్తున్నామని కొందరు తెలిపారు. దీంతో ప్రభుత్వం చేనేత నేస్తం డబ్బులను తమకు ఇవ్వకుండా ఆ పథకానికి తమను దూరం పెడుతోందని వాపోయారు. నూలు సబ్సిడీ, విద్యుత్ బిల్లుల చెల్లింపులో రాయితీ వంటి సంక్షేమ కార్యక్రమాలను పూర్తిగా ఎత్తివేయడంతో జీవనం భారమైపోయిందన్నారు. వర్షాకాలంలో మగ్గాల గుంతల్లోకి నీరు చేరితే వారం పదిరోజులపాటు పనులు లేక పస్తులుండాల్సి వచ్చినా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఆ తర్వాత బ్రహ్మణి ఆత్మకూరు నిర్మలా జంక్షన్ సమీపంలో మోతుకూరి రవికి చెందిన డైయింగ్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా డైయింగ్ కార్మికులు తమను నేత కార్మికులుగా ప్రభుత్వం గుర్తించడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. నూలుకు రంగులు అద్దె ప్రక్రియ ఎంతో కష్టతరమైందేకాకుండా రసాయనాలతో పనిచేయడం వల్ల ఆరోగ్యసమస్యలు వస్తుంటాయన్నారు. ఆరోగ్యానికి నష్టమని తెలిసినా వేరే పనులు చేతకాక ఇదేపనిని కొనసాగించాల్సి వస్తుందన్నారు. దశాబ్దాల తరబడి తమ సమస్యలను ఎవ్వరూ పరిష్కరించడం లేదని వారు వాపోయారు. కాగా, బ్రహ్మణి వారిని సమాధానపరుస్తూ నేత కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకే లోకేశ్ రెండేళ్లుగా దీర్ఘాలోచన చేసి మంగళగిరిలో వీవర్స్‌శాలను ఏర్పాటు చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు నందం అబద్దయ్య, గుత్తికొండ ధనుంజయరావు, దామర్ల రాజు, కారంపూడి అంకమ్మరావు, తమ్మిశెట్టి హరికృష్ణ, గోవాడ దుర్గారావు, పడవల మహేష్, తమ్మిశెట్టి జానకీదేవి తదితరులు పాల్గొన్నారు.


మంగళగిరి వీవర్స్‌కాలనీలో ప్రైవేటు మగ్గాల షెడ్డులో పరిస్థితులను పరిశీలిస్తున్న నారా బ్రాహ్మణి



వెంకటపాలెం రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు

జగన్ దిగిపోతేనే రాష్ట్రానికి మేలు

● 1,523వ రోజుకు చేరిన రైతుల ఆందోళనలు

తుళ్లూరు, ఫిబ్రవరి 17: జగన్‌రెడ్డి దిగిపోతేనే రాజధాని అమరావతికి మేలు జరిగి రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని 33వేల ఎకరాల భూములను త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు, నిరసన దీక్షలు శనివారం నాటికి 1,523వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడారు. ఎక్కడా అభివృద్ధి చేయకుండా జనానికి సంక్షేమ పథకాలని పప్పుబెల్లాలు పంచి, అందినకాడికి వైసీపీ నేతలు దోచుకున్నారని ఆరోపించారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి ఇరవై సంవత్సరాలు వెనకబాటుకు గురి చేశారన్నారు. రాజ్యాంగ విరుద్ధంగా మూడు రాజధానుల నిర్ణయం తీసుకున్నారన్నారు. అందుకే రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం అమరావతి అభివృద్ధిని కొనసాగించమని తీర్పు చెప్పిందన్నారు. అమరావతి అభివృద్ధితో రాష్ట్ర ప్రగతి విరాజిల్లుతుందన్నారు. కాని సీఎం జగన్‌రెడ్డి అమరావతి నాశనం కోరుకోవటంతో రాష్ట్రాభివృద్ధి అగమ్యగోచరమైందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని ప్రకటించి అభివృద్ధి పనులు కొనసాగించాలన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలతో పాటు మంగళగిరి తాడికొండ నియోజకవర్గాలలో రైతుల ఆందోళనలు కొనసాగాయి.

దాడి చేసినవారు స్వేచ్ఛగా తిరుగుతున్నారు

● గాయపడిన ఇరువురు పరిస్థితి దారుణంగా ఉంది

● టీడీపీ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాశం జిల్లా టీడీపీ అధ్యక్షుడు నూకసాని బాలాజీ, డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 17: జంగమేశ్వరపాడులో జరిగిన దాడిలో గాయపడిన ఇరువురు పరిస్థితి దారుణంగా, ఉందని టీడీపీ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ అన్నారు. శనివారం మాచర్ల నియోజకవర్గం దుర్గి మండలం జంగమేశ్వరపాడులో వైసీపీ దాడిలో గాయపడి నరసరావుపేట ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగ్రాతులను టీడీపీ నియమించి త్రీమెన్ కమిటీ సందర్శించి పరామర్శించింది. ఈ కమిటీలో బాలాజీతో పాటు టీడీపీ రాష్ట్ర టీడీపీ యాదవ సాధికార కమిటీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, టీడీపీ బీసీ సెల్ జోనల్ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ ఉన్నారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ ఏవరైతే దాడి చేశారో వాళ్ళమీద కేసులు లేవని, వారంతా స్వేచ్ఛగా తిరుగుతున్నారని అన్నారు. ఎమ్మెల్యే రాజకీయ స్వలాభం కోసం బలహీన వర్గాల మధ్య కక్షలు పెంచారని ఆరోపించారు. గతంలో జల్లయ్య అనే అతనిని చంపేశారని, ఎవరైతే జల్లయ్యను హత్యచేశారో వాళ్ళే మళ్ళీ జంగమేశ్వరపాడులో దాడి చేశారని అన్నారు. ఎస్పీ శాంతి, భద్రతలను ఎందుకు అదుపు చేయలేకపోతున్నారని నిలదీశారు. ఎమ్మెల్యే, ఆయన తమ్ముడి ఇంట్లో శుభకార్యక్రమం జరిగితే బలహీనవర్గాల మీద దాడి చేసి రక్తం కళ్ళ చూడటం ఒక రాక్షస క్రీడన్నారు. ఈ రాక్షస క్రీడకు త్వరలోనే చరమగీతం పాడతామన్నారు. ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించడానికి కూడా బంధువులు, మహిళలు భయపడి పోతున్నారని అన్నారు. బాధితులకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని కోరారు. టీడీపీ నరరావుపేట నియోజవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అవినీతి, దుర్మార్గాలు ఎక్కువ అయ్యాయన్నారు. పల్నాడు జిల్లా ఎస్పీ వచ్చిన తర్వాత క్రైమ్ రేటు పెరిగిందన్నారు. బాధితులకు పోలీసులు, కలెక్టర్ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కడియం కోటి సుబ్బారావు, రాంబాబు, బాధిత గ్రామస్తులు, బంధువులు పాల్గొన్నారు.

పల్నాటి ప్రజలే ముందుండి నడిపించారు..

● అందరి మన్ననలు పొందడానికి అవకాశం ఇచ్చింది వారే..

● ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



మాట్లాడుతున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు తదితరులు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 17: అందరి మన్ననలు పొందడానికి కారణం పల్నాటి ప్రజలేనని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. శనివారం నరసరావుపేట ఎన్జీవో కాలనీ ఎంపీ కార్యాలయంలో నరసరావుపేట ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు ఎంపీతో సమావేశమై సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ లావు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అభిమానించిన వ్యాపారులకు ధన్యవాదాలు తెలిపారు. పల్నాటి ప్రజలు తప్పు చేస్తే ముఖంమీద చెప్పే వ్యక్తులేనని అన్నారు. మంచిపేరు సంపాదించుకోవడానికి కారణం ఇక్కడ ఉన్న ప్రజలేనని ప్రశంసించారు. వరికపూడిశల ప్రాజెక్టుకు అనుమతులు అన్ని తీసుకురావడం జరిగిందన్నారు. పనులు ప్రారంభమైతే ఏడాదిలో పూర్తి అవుతుందన్నారు. నాగార్జునసాగర్ కుడికాలువ స్థిరీకరణ గురించి ఆలోచిస్తున్నానని అన్నారు. వర్షాలు దండిగా పడితే కుడికాలువకు నీరు వస్తుందని, గోదావరి, కృష్ణ అనుసంధానం జరిగితేనే సమస్య పరిష్కారం అవుతుందని, వచ్చే ఐదు సంవత్సరాల్లో అది సాధించేలా కృషి చేస్తామన్నారు. కేంద్రప్రభుత్వం పీఎంసీ పథకంతో ముందుకువచ్చిందని, కేంద్రీయ విద్యాలయం స్థాయిలో ఉండే పీఎంసీ స్కూల్ ప్రతి మండలంలో ఉండే విధంగా ప్రయత్నం చేస్తామన్నారు. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో వంద పడకల ఆసుపత్రి ఉండాలన్నారు. ఇక్కడ ఉన్న యువతకు టెక్స్‌టైల్స్, లేదా మిర్చికి సంబంధించి సెజ్ ఏర్పాటు చేస్తే ఉపాధి కల్పించిన వారం అవుతామన్నారు. టెక్స్‌టైల్స్, మిర్చికి సంబంధించిన సెజ్ కేంద్రప్రభుత్వం ద్వారా సాధించుకోవాల్సిన అవసరం ఉందని, రాబోయే ఐదు సంవత్సరాల్లో అది సాధించే దిశగా పనిచేస్తామన్నారు. తటస్థులుగా ఉండే వ్యాపారులు ప్రజలను చైతన్యపరిచి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు మాజేటి వెంకటేష్, ఆర్యవైశ్య సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు అత్తులూరి సుబ్బారావు, వనమా శివ, వ్యాపారులు పాల్గొన్నారు.

మిగిలింది డొక్కు బస్సులే..

● జీటీ రోడ్డులో నిలిచిన ఆర్టీసీ బస్సు

● మరో బస్సు కోసం ప్రయాణీకుల పడిగాపులు

గుంటూరు, ఫిబ్రవరి 17: అసలే సగం డొక్కు బస్సులు.. అందులో కండిషన్‌లో ఉన్న సర్వీసులను సీఎం సభకు తరలించారు. మిగిలిన బస్సులు మొరాయిస్తూ మార్గమధ్యలోనే నిలిచిపోతున్నాయి. శనివారం రాత్రి పది గంటల సమయంలో గుంటూరు నుంచి నరసరావుపేట వెళుతున్న నరసరావుపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు జీటీ రోడ్డులోని మెడికల్ క్లబ్ సెంటర్‌లో ఆగిపోయింది. సాంకేతిక లోపంతో నిలిచిన బస్సును బాగుచేసేందుకు సిబ్బంది విశ్వప్రయత్నాలు చేసి గుంటూరులోని అధికారులకు సమాచారం అందించారు. మరొక సర్వీసు పంపించాలని కోరారు. మరొక బస్సు వచ్చే వరకు ప్రయాణీకులు పడిగాపులు కాయాల్సివచ్చింది. నగరంలో నిలిచిపోయింది కాబట్టి సరిపోయింది ఎక్కడో జాతీయ రహదారి మధ్యలో నిలిచిపోతే పరిస్థితి ఏంటంటూ ప్రయాణీకులు వాపోయారు. అనంతపురంలో ఈ నెల 18న సీఎం జగన్ నిర్వహించే సిద్ధం సభకు ఉమ్మడి జిల్లా నుంచి 292 సర్వీసులు తరలించారు. విభజిత జిల్లాల నుంచి సగం సర్వీసులను సీఎం సభకు తరలించారు. అందునా కండిషన్‌లో ఉన్న సర్వీసులను తరలించి డొక్కు బస్సులను ప్రయాణీకులకు వదిలేశారు. మార్గమధ్యంలోనే డొక్కు బస్సులు మొరాయిస్తున్నాయి. పల్నాడు ప్రాంతానికి వెళ్ళేందుకు అనేకమంది ప్రయాణీకులు గుంటూరు మార్కెట్ సెంటర్‌లోని పల్నాడు బస్టాప్‌లో అర్ధరాత్రి వరకు బస్సుల కోసం పడిగాపులు కాశారు.

నేటి నుంచి రిలే దీక్షలు.. అటుపై సమ్మెలోకి..

● వీఆర్‌ఏ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ఉమామహేశ్వరరావు



మాట్లాడుతున్న కే ఉమామహేశ్వరరావు, పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 17: విజయవాడ ధర్నా చౌక్‌లో ఈనెల 18, 19 తేదీల్లో జరిగే రిలేదీక్షలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె. ఉమామహేశ్వరావు పిలుపునిచ్చారు. స్థానిక బ్రాడీపేటలో సీఐటీయూ నగర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. గ్రామ రెవెన్యూ సహాయకులకు పేస్కేల్, 2018నుంచి రికవరీ చేసిన డీఏ బకాయిలు తిరిగి చెల్లింపులు, నామినీలను వీఆర్‌ఏలుగా గుర్తించడం, అర్హులైనవారికి పదోన్నతి తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ దీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. గత ఎన్నికలకు ముందు విజయవాడ ధర్నాచౌక్‌లో జరిగిన వీఆర్‌ఏల ధర్నా శిబిరానికి సీఎం జగన్‌మోహనరెడ్డి హాజరై మన ప్రభుత్వం వచ్చిన వెంటనే వీఆర్‌ఏల జీతం రూ.15000కు పెంచుతామని చెప్పి, ఇప్పుడు మాత్రం 2018 నుంచి రూ.300 చొప్పున డీఏని జీతాల నుంచి సుమారు రూ.15వేలు ప్రభుత్వం రికవరీ చేసిందని గుర్తుచేశారు. సమస్యలపై పలుమార్లు విన్నవించినా ప్రభుత్వం పట్టించుకో వడం లేదని పేర్కొన్నారు. రెండు రోజులు పాటు జరిగే దీక్షలకు దిగిరాకపోతే, ఈనెల 20 తరువాత ఏ రోజునైనా నిరవధిక సమ్మెలోకి వెళ్తామని స్పష్టం చేశారు. సమావేశంలో యూని యన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ బందగి సాహెబ్, కోశాధికారి వడ్డే బాజీబాబు, జిల్లా నాయకులు బీ లక్ష్మణరావు, బీ ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.


25న ఉమ్మడి జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక

కొల్లూరు, ఫిబ్రవరి 17: ఉమ్మడి గుంటూరు జిల్లా కబడ్డీ సీనియర్స్ పురుషుల జట్టు ఎంపికను ఈ నెల 25వ తేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి డి.నెల్లిరెడ్డి శనివారం తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ బాలురోన్నత పాఠశాలలో జరిగే ఎంపికల్లో జిల్లా జట్టుకు ఎంపికైనవారు మార్చి 8, 9, 10 తేదీలలో నెల్లూరు జిల్లా కొవ్వూరులో జరిగే 70వ అంతర్‌జిల్లా పోటీలలో పాల్గొంటారన్నారు. క్రీడాకారులు 25వ తేదీన ఉదయం 9 గంటలకు బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణానికి చేరుకోవాలన్నారు. క్రీడాకారులు 85 కిలోల బరువు కలిగి ఉండాలన్నారు. ఇతర వివరాలకు 99893 48699, 94902 74746 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్టు

గుంటూరు, ఫిబ్రవరి 17: స్థానిక నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏటుకూరులో గల శ్రీతిరుమల అయ్యప్ప రియల్ ఎస్టేట్ ప్లాట్‌లలో నల్లచెరువుకు చెందిన కలవ నాగపూజను హత్యచేసిన కేసులో నిందితుడైన రేటూరి నాగరాజును నల్లపాడు పోలీసులు అరెస్ట్ చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు మారణాయుధాలు ఉపయోగించి ఆమెను హత్య చేసిన విషయం విదితమే. దీనిపై నల్లపాడు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదుచేసి దర్యాప్తు చేసి సదరు కేసులోని నిందితుడైన కాకుమాను మండలం రేటూరు గ్రామానికి చెందిన రేటూరి నాగరాజుని అదుపులోకి తీసుకున్నారు. అతడు, నాగపూజను తానే హత్య చేసినట్లు అంగీకరించాడు. నాగపూజపై అనుమానంతో ఈ హత్య చేసినట్లు దర్యాప్తులో తేలిందని సీఐ రాంబాబు తెలిపారు. కాగా నిందితుడు నాగరాజును అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి




నాగరాజు మృతదేహం

చేబ్రోలు, ఫిబ్రవరి 17: చేబ్రోలు మండల శివారులో రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడు గ్రామానికి చెందిన బుర్రి నాగరాజు ప్రైవేటు బ్యాంక్‌లో పని చేస్తూ విధులు ముగించుకొన్ని ఇంటికి బయల్దేరాడు. నారాకోడూరు గ్రామం నుంచి లేమల్లెపాడు గ్రామం రోడ్డులో ఓ మహిళను ఢీకొని ద్విచక్ర వాహనం పైనుంచి కిందకు పడిపోయాడు. ప్రమాదంలో బుర్రి నాగరాజు (33) సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. ప్రమాదంలో గాయపడిన మహిళను చికిత్స నిమ్మిత్తం గుంటూరు తరలించారు. ఈ ప్రమాదంపై చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

కృష్ణానదిలో ఈతకు దిగి వ్యక్తి...

తాడేపల్లి, ఫిబ్రవరి 17: తాడేపల్లి మండలం ఉండవల్లి సమీపంలోని కొండవీటి వాగు ఎత్తిపోతల ప్రాంతంలో శనివారం ఓ వ్యక్తి ఈతకు దిగి ప్రాణాలు కోల్పోయాడు. విజయవాడ అయ్యప్పనగర్‌కు చెందిన కుంచే లోకేశ్ (27) భార్య, ఇద్దరు పిల్లలతో శనివారం సాయంత్రం నది వద్దకు వచ్చి స్నానానికి దిగారు. పిల్లలకు స్నానం చేయించిన అనంతరం లోకేశ్ కొద్దిసేపు నీటిలోనే ఈత కొడుతూ ప్రమాదవశాత్తూ మునిగిపోయాడు. లోకేశ్ బయటకు రాకపోవడంతో భార్య కమలకుమారి స్థానిక మత్స్యకారులకు విషయం తెలిపింది. అనంతరం విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మత్స్యకారుల సహాయంతో ఒడ్డుకు చేర్చారు. మృతుడు బజాజ్ క్యాపిటల్‌లో పని చేస్తాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంగళగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తాడేపల్లి ఎస్‌ఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదుపుతప్పి ఆటో బోల్తా - ఒకరు...



చిన దానియేలు మృతదేహం

వెల్దుర్తి, ఫిబ్రవరి 17: అదుపుతప్పి ఆటో బోల్తా కొట్టగా ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని కండ్లకుంటలో జరిగింది. మండలంలోని గుండ్లపాడు గ్రామానికి చెందిన కంభంపాటి చిన దానియేలు (45) పశువుల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఈ క్రమంలో శనివారం కండ్లకుంటకు వెళ్లి తిరుగు ప్రయాణంలో ఆటో ఎక్కాడు. గ్రామం దాటగానే ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న తెలంగాణ రాష్ట్రం దేవరకొండకు చెందిన శాంతితోపాటు మరో మహిళ గాయపడ్డారు. వీరిని మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాగా చినదానియేలు అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. శాంతి, మరో మహిళ చికిత్స పొందుతున్నారు. మృతునికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి ప్రభుత్వ వైద్యశాలకు చేరుకొని చిన దానియేలు భౌతికకాయాన్ని సందర్శించారు. మృతుని కుటుంబసభ్యులను పరామర్శించి మట్టి ఖర్చులకు రూ.20వేలను అందించారు.

చంద్రబాబుది సంక్షేమం.. జగన్‌రెడ్డిది శాడిజం

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



టీ స్టాల్ వద్ద స్థానికులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 17: ముఖ్యమంత్రులుగా చంద్రబాబుది సంక్షేమం అయితే జగన్‌రెడ్డిది శాడిజం అనే విషయం ఈ ఐదు సంవత్సరాల్లో ప్రతి ఒక్కరికి అనుభవంలోకి వచ్చిందని మాజీమంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. అందుకే ఎన్నికలు ఎప్పుడు వస్తాయా?, ఆ సైకోరెడ్డి ఎగ్జిట్ బటన్ నొక్కి ఎప్పుడు విముక్తి పొందుదామా? అని ప్రజలంతా ఎదురు చూస్తున్నారన్నారు. అందుకే జగన్ ఇప్పుడు ఓటమి సంకేతాలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని, కొత్త మార్గాల్లో ప్రజలను మోసం చేయటం, బెదిరించటం పై దృష్టి పెట్టినట్టు కన్పిస్తుందన్నారు. జగన్ ఓడిపోతే సంక్షేమ పథకాలు ఆగిపోతాయన్నది పచ్చి అబద్ధమన్నారు. సంక్షేమ పథకాలు జగన్ రాక ముందు కూడా ఉన్నాయి. జగన్ పోయిన తరువాత కూడా కొనసాగుతాయని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. శనివారం పట్టణంలోని కృష్ణమహల్ రోడ్డులో టీ దుకాణం వద్ద ఆగిన ప్రత్తిపాటి స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారితో కలసి టీ తాగారు. టీడీపీ అధికారంలోకి వస్తే అంతా మంచి జరుగుతుందని ప్రత్తిపాటి వారికి భరోసా ఇచ్చారు. మరింత సంక్షేమం దిశగా చంద్రబాబు ఆలోచనలు చేస్తున్నారని, సూపర్ - 6 పథకాల రూపంలో ఈ నమూనాలను ఇప్పటికే ప్రజల ముందు పెట్టారని ఆయన గుర్తు చేశారు.

పోస్టింగ్‌లు పెడుతున్నాడనే అక్కసుతో దాడి

● అర్ధరాత్రి టీడీపీ సానుభూతిపరుడిపై వైసీపీ మూకల దాష్టీకం

● అడ్డువచ్చిన కుటుంబ సభ్యులపైనా..

పెదనందిపాడు, ఫిబ్రవరి 17: సోషల్ మీడియాలో వైసీపీకి వ్యతిరేకంగా పోస్టింగ్‌లు పెడుతున్నాడనే అక్కసుతో వైసీపీ మూకలు దాడి చేసిన సంఘటన మండల పరిధిలోని కొప్పర్రులో చోటు చేసుకుంది. కొప్పర్రుకు చెందిన షేక్ జానీబాషా(ఫోటోగ్రాఫర్) పెదనందిపాడులో ఓ ఫంక్షనుకు వెళ్తుండగా అదే సమయంలో బీసీ కాలనీ వద్ద ఫ్లెక్సీలు కట్టేందుకు సిద్ధంగా ఉన్న వైసీపీ నాయకులు ఫ్లెక్సీని కావాలనే అతనిపై విసిరేశారు. జానీబాషా ఎందుకు వేశారు అని ప్రశ్నించగా వారు దుర్భాషలాడారు. దీంతో కుటుంబసభ్యులు కలుగజేసుకోవడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. జానీ బాషా తండ్రి మస్తాన్‌వలిని తీవ్రంగా కొట్టి గాయపరిచారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్ళి దాడికి గల వివరాలు సేకరించి పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

సబ్ జైలు ఖైదీల తరలింపు

తెనాలి క్రైం, ఫిబ్రవరి 17: సబ్ జైలు ఖైదీలను తరలించినట్లు జైలు సూపరింటెండెంట్ కృష్ణారావు శనివారం తెలిపారు. ఇక్కడ ఉన్న 36మంది ఖైదీలలో ముగ్గురు మహిళా ఖైదీలను గుంటూరు సబ్ జైలుకు, 10మంది ఖైదీలను బాపట్ల సబ్ జైలుకు, 23 మంది ఖైదీలను రేపల్లె సబ్ జైలుకు తరలించినట్లు ఆయన తెలిపారు. తెనాలి సబ్‌జైలు 100 సంవత్సరాల పూర్వం బ్రిటీష్ ప్రభుత్వం నిర్మించిన సబ్‌జైలు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఈ స్థానంలో నూతన సబ్‌జైలు నిర్మాణానికిగాను ఖైదీలను తరలించి త్వరలో నిర్మాణపనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.42 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	142, 151, 165
చికెన్ విత్ స్కిన్	280.00
చికెన్ స్కిన్ లెస్	290.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో రవీంద్ర, తాళ్ల వెంకటేశయాదవ్ తదితరులు

బాబుతోనే భావితరాలకు భవిష్యత్తు ..

● గుంటూరు పశ్చిమ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర

గుంటూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): భావితరాల భవిష్యత్తుకు టీడీపీ అధినేత చంద్రబాబు బాటలు వేయనున్నట్లు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర(నాని) అన్నారు. గుంటూరు బ్రాడీపేటలో శనివారం ఆయన 'భవిష్యత్తుకు గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి చంద్రబాబు సంతకంతో కూడిన హామీపత్రాలను అందజేసారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నామని ఢాంబికాలు పలుకుతున్న జగన్ రెడ్డి, తమతో పాటు కార్యక్రమంలో పాల్గొంటే ఆయన పథకాల సంగతి ఏంటనేది తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు జుపిటర్ ప్రసాద్, తాళ్ల వెంకటేశ్వరరావు, ఈరెంటి వరప్రసాద్, కట్టా కాళిదాస్, హుస్సేన్, కొప్పు కూల నారాయణ, నాగ జయంతి, గద్దం శ్రీను, మస్తాన్‌వలి, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి ఓటమి భయం పట్టుకుంది

● టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్



గుంటూరు,ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంపై ప్రజల్లోఏర్పడిన వ్యతిరేకతతో వైసీపీకి ఓటమి భయం పట్టుకుందని టీడీపీ గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎన్నికల తర్వాత టీడీపీ- జనసేన ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని తేల్చి చెప్పారు. టీడీపీ హయాంలో నగరంలో ఎటువంటి క్లిష్ట సమయంలోనైనా తాగునీటి సరఫరాకు ఏ ఆటంకం లేకుండా ఉండేదన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి శూన్యమన్నారు. అన్నివర్గాల ప్రజల ఆశలు జగన్‌రెడ్డి ఒమ్ము చేశారని ఆరోపించారు. ఈ నియంత ప్రభుత్వాన్ని ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

టీడీపీ ప్రముఖులను కలిసిన డాక్టర్ పెమ్మసాని

గుంటూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): టీడీపీ గుంటూరు పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్న డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ టీడీపీ సీనియర్ నేతలు, మాజీ మంత్రులు కన్నా లక్ష్మీ నారాయణ, మాకినేని పెదరత్తయ్యలను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. గుంటూరులోని వారి నివాసాలకు వెళ్లి కలిసిన ఆయన వారిని దుశ్శాలువాతో సన్మానించారు. గుంటూరు పార్లమెంటు పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల స్థితిగతులపై వారితో చర్చించారు. అనంతరం గుంటూరులోని క్రేన్ సంస్థల అధినేత గ్రంధి కాంతారావును కలిసి ఆయనతో పలు విషయాలు చర్చించారు.



గుంటూరులో మాకినేని పెదరత్తయ్య, కన్నా లక్ష్మీ నారాయణలను కలిసిన పెమ్మసాని



ఇంటింటికి ఉచిత మినరల్ వాటర్



శారదాకాలనీ ప్రజలతో మాట్లాడుతున్న నసీర్, తెనాలి శ్రావణ్‌కుమార్

● తెనాలి శ్రావణ్‌కుమార్, మొహమ్మద్ నసీర్ వెల్లడి
● శారద కాలనీలో మినరల్ వాటర్ ట్యాంక్ ఏర్పాటు
● ఇక్బాల్ కుంటుంబానికి రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్

గుంటూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు స్ఫూర్తితో ఇంటికీ మినరల్ వాటర్ ఉచితంగా అందిస్తామని టీడీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్, తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్‌లు తెలిపారు. నగరంలో కలుషిత నీరు తాగి ప్రజలు డయేరియా బారినపడుతున్న నేపథ్యంలో శనివారం శారదా కాలనిలో నసీర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మినరల్ వాటర్ ట్యాంకర్‌ను శ్రావణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతూ నగరంలో కలుషిత తాగునీరు సరఫరాతో ప్రజలు ప్రాణాలు పోయే స్థితికి వచ్చినా ప్రభుత్వ యంత్రాంగం, నగరపాలక సంస్థ క్షేత్రస్థాయిలో ఏ చర్యలు చెపట్టకపోవడం దుర్మార్గమన్నారు. తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని గత నెల రోజులుగా మేయర్, కమిషనర్, ఎమ్మెల్యేకి ఎన్నిసార్లు ఫిర్యాదుచేసినా ఇప్పటికీ స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఇద్దరు చనిపోయారని, ఇప్పటికైనా మొద్దునిద్ర వీడి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో మరిన్ని వాహనాలు ఏర్పాటు చేసి, తూర్పు నియోజకవర్గంలో ప్రతి ఇంటికి సురక్షిత తాగు నీరు అందిస్తామన్నారు. గురువారం మృతిచెందిన ఇక్బాల్ కుటుంబానికి ప్రభుత్వం రూ.10లక్షలు ఆర్థికసాయం చేయకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు రాజామాస్టారు, జాగర్లమూడి శ్రీనివాసరావు, టీడీపీ కార్పొరేటర్లు ముప్పవరపు భారతి, పోతురాజు సమత, గుడిమెట్ల దయారత్నం, మహంకాళి నరసింహ రావు, శ్రీనునాయక్, గొళ్ల ప్రభాకర్ రావు,కొత్తూరు వెంకట్, మల్లెంపూడి శ్రీనివాస్, వెంకటేష్, రమణ, గుడిపల్లి వాణి, నాయుడు మల్లిక, రెహమునిస, తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు తారక రామానగర్‌లో మొహమ్మద్ నసీర్ ఆధ్వర్యంలో 'భవిష్యత్తుకు గ్యారంటీ' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు స్ఫూర్తితో ప్రతి ఇంటికీ మినరల్ వాటర్‌ను ఉచితంగా పంపిణీ చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో జబీఖాన్, అన్వర్, భాషి, వెంకటేశ్వర్లు, బాబు, రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

బకాయిల బటన్ ఎప్పుడు నొక్కుతారు ?

● ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్నఉద్యోగుల నిరసనలు
● 20న జిల్లా స్థాయి ధర్నా.. ఉద్యోగులు పాల్గొనాలని పిలుపు



తాలుకా కార్యాలయం వద్ద నిరసనల్లో పాల్గొన్న ప్రభుత్వ ఉద్యోగులు

గుంటూరు(తూర్పు),ఫిబ్రవరి17: ప్రజలకు అనేక సంక్షేమ పథకాల నిమిత్తం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పలుబటన్లు నొక్కుతున్నారని, మరి ఉద్యోగుల బకాయిల చెల్లింపు బటన్ ఎప్పుడు నొక్కుతారని ఏపీ జేఏసీ జిల్లా నేతలు ప్రశ్నించారు. ఉద్యమ కార్యాచరణలో భాగంగా శనివారం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు నల్ల బ్యాడ్జీలను ధరించి గుంటూరు పశ్చిమ తాలూకా కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఏపీ జేఏసీ ఛైర్మన్ బండి శ్రీనివాసరావు హాజరై సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు తమకు రావాల్సిన బకాయిల కోసం 58 నెలల నుండి వేచిచూస్తున్నారన్నారు. బకాయిలు చెల్లించక పోగా వారు దాచుకున్న జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ సొమ్మును ప్రభుత్వం వాడుకుంటుందని ఆరోపించారు. జేఏసీ జిల్లా కన్వీనర్ శెట్టిపల్లి సతీష్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా ఉద్యోగులు పనిచేస్తున్నారని, వారి సమస్యల పరిష్కారాన్ని విస్మరించటం ప్రభుత్వానికి తగదని అన్నారు. ఏ ప్రైవేటు ఆస్పత్రిలో ఉద్యోగులకు ఇచ్చిన ఆరోగ్య కార్డులను అనుమతించట్లేదని, మెడికల్ రీఎంబర్స్‌మెంట్ చెల్లింపులోనూ బాగా జాప్యం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేవారు. నిరసనల్లో భాగంగా ఈనెల 20న తలపెట్టిన జిల్లా కేంద్రాల్లో, ర్యాలీలో పెద్ద ఎత్తున ఉద్యోగులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు తాలుకా కార్యాలయం నుంచి అంబేద్కర్ కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. నిరసనల్లో విశ్రాంత ఉద్యోగుల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రభుదాస్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు బసవలింగారావు, వేలంగిని రాజు, ఎన్జీ జీవో నేతలు శ్యాంసుందర్, కూరాకుల శ్రీనివాసరావు, శివజ్యోతి, పీటీడీ ఉద్యోగసంఘాల నేతలు రవీంద్రరెడ్డి, రంజిత్ కుమార్‌నాయుడు, తిరుమల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల నృత్య ప్రదర్శనలు

క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలు సాధించాలి

● భాష్యం కల్చరల్ ఫెస్ట్‌లో డాక్టర్ రమణ యశస్వి

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 17: పట్టుదల, క్రమశిక్షణ, ఏకాగ్రత ఉంటే ఎంతటి లక్ష్యాన్నైనా సునాయాసంగా సాధించవచ్చని ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రమణ యశస్వి అన్నారు. శనివారం భాష్యం ఐఐటి ఫౌండేషన్ అకాడమీ ఆధ్వర్యంలో భాష్యం రామసేతు క్యాంపస్‌లో 'తరంగ్ ది వేవ్' పేరిట కల్చరల్ ఫెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ రమణ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతూ జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. భాష్యంవిద్యాసంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకోవాలన్నారు. డైరెక్టర్ భాష్యం హనుమంతరావు, రామసేతు ప్రిన్సిపాల్ షఫీ, భాష్యం ఐఐటీ ప్రోగ్రామర్ ఆనంద్ కుమార్, ఆయుర్వేద వైద్యులు కొండా వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అలరించిన నిర్విరామ వీణా కచేరి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి17: స్థానిక బృందావన గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ పద్మావతి కళ్యాణమండపంపై రామరాజు ఫౌండేషన్, వాగ్దేవి సంగీత నిలయం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం జరిగిన నిర్విరామ వీణాకచేరి ప్రేక్షకులను అలరించింది. అనంతరం జరిగిన సభకు సంస్థ ఛైర్మన్ డాక్టర్ రామరాజు శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. అతిథులుగా రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షులు పి విజయబాబు, సాహితీవేత్తలు డాక్టర్ వోలేటి పార్వతీశం, డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, ఆలయకమిటి అధ్యక్షుడు మస్తానయ్య తదితరులు పాల్గొని వీణావిద్వాంసులు డీ. శ్రీనివాస్‌ను పద్మశ్రీ డాక్టర్ ఈమని శంకరశాస్త్రి స్మారక పురస్కారంతో ఘనంగా సత్కరించారు.



సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థినుల నృత్య ప్రదర్శన

విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

● అభ్యుదయ మహిళా కళాశాల డైరెక్టర్ బీఎస్ఆర్కే ప్రసాద్

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 17: విద్యార్థినులు పాఠ్యాంశాలపై పట్టు సాధించడంతోపాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని అభ్యుదయ మహిళా డిగ్రీ కళాశాల డైరెక్టర్ బీఎస్ఆర్కే ప్రసాద్ సూచించారు. శనివారం అమరావతి రోడ్డులోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్లో ఫేర్‌వెల్‌డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, డేటా సైన్స్ కోర్సులపై సెమినార్ నిర్వహించారు. ఏఎన్‌యూ ప్రొఫెసర్ డాక్టర్ యూ.సూర్యకామేశ్వరి కోర్సు వివరాలు, ప్రాముఖ్యత, ఉపాధి అవకాశాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రోహినిదేవి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గుంటూరు, ఫిబ్రవరి 17: రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా బ్రాడీపేట 3, 4, 5 లైన్లలో ఆదివారం ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ షేక్ ముస్తాక్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.



మాట్లాడుతున్న డాక్టర్ లావు రత్తయ్య, వేదికపై లక్ష్మణరావు తదితరులు

సృజానాత్మక నైపుణ్యాలే..
వినూత్న ఆలోచనలకు దిక్సూచి

● విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య
● హిందూ కళాశాలలో ఘనంగా ప్రారంభమై 'బాలోత్సవ్'

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 17: విద్యార్థుల్లో అంతర్లీనంగా ఉన్న సృజానాత్మక నైపుణ్యాలను ప్రోత్సహిస్తే వారు వినూత్న ఆలోచనలతో నూతన ఆవిష్కరణలకు దిక్సూచిగా మారతారని విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అన్నారు. హిందూ కళాశాలలో శనివారం ప్రారంభమైన బాలోత్సవ్ వేడుకల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఎవరైతే కొత్తగా ఆలోచిస్తారో వారే నిజమైన శక్తివంతులుగా మారతారని, ఇందుకు ఉదాహరణ రెడ్‌బస్ యాప్‌ను తయారుచేసిన తమ కళాశాల పూర్వ విద్యార్థే నిదర్శనమని అన్నారు. ఈ శతాబ్దంలో జ్ఞానాన్ని విస్తృత స్థాయిలో వినియోగించేవారే సమాజ గతిని మార్చగలరన్నారు. చలపతి విద్యాసంస్థల ఛైర్మన్ వైవీ. ఆంజనేయులు మాట్లాడుతూ ఉన్నతంగా ఎదిగే విద్యార్థులకు బాలోత్సవాలు వేదిక కావడం అభినందనీయమని తెలిపారు. ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ సత్తుపల్లి పట్టణంలో 25 సంవత్సరాల పాటు వాసిరెడ్డి రమేష్ నిర్వహించిన బాలోత్సవాల స్ఫూర్తితో గత మూడు సంవత్సరాలుగా రాష్ట్ర వ్యాప్తంగా 40కిపైగా కేంద్రాల్లో విద్యార్థులలో దాగివున్న అంతర్గత నైపుణ్యాలను వెలికితీసేందుకు బాలోత్సవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి సీహెచ్.రామకృష్ణ మూర్తి, అభ్యాస్ అకాడమీ సీఈవో డాక్టర్ బీ.ఫణి పవనశాస్త్రి, పిన్నమనేని మురళీకృష్ణ, ఎన్.తిరుపతయ్య, డాక్టర్ ఎం.బోసుబాబు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తాడిశెట్టి మురళీమోహన్ తదితరులు

వైసీపీలో ఎన్నో అవమానాలను భరించాం

● గుంటూరులో ఆత్మీయ సమ్మేళనం, అభిమానులదే అంతిమ నిర్ణయం
● మాజీ డిప్యూటీ మేయర్ తాడిశెట్టి మురళీమోహన్

గుంటూరు, ఫిబ్రవరి 17: వైసీపీలో ఎన్నో అవమానాలను భరించామని, ఏనాడు బీసీ కార్డు ఉపయోగించుకోలేదని, వైసీపీలో మాత్రం బీసీలను అణగదొక్కే ప్రయత్నం జరుగుతుందని మాజీ డిప్యూటీ మేయర్ తాడిశెట్టి మురళీ మోహన్ ఆరోపించారు. బ్రాడీపేటలోని ఓ హోటల్లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2004లో తన సోదరుడు తాడిశెట్టి వెంకటరావు ఎమ్మెల్యేగా, తాను డిప్యూటీ మేయర్‌గా నగర ప్రజలకు సేవలందించామన్నారు. జగన్‌పిలుపుతో వైసీపీలో చేరామన్నారు. 2019 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేశామన్నారు. ఎమ్మెల్యే స్థాయి కుటుంబమైన తమకు సముచితస్థానం కల్పిస్తారని ఆశించామని, కానీ ఇక్కడ గుర్తింపు సున్నా అన్నారు. వైసీపీలో రాష్ట్ర స్థాయిలో కానీ ఇక్కడ కానీ కొందరి దళారీ వ్యవస్థతో పొమ్మనకుండా పొగబెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు గుర్తింపులేని పార్టీలో కొనసాగుతుండటంపై తమ అభిమానులు, శ్రేయోభిలాషుల నుంచి తీవ్రమైన ఒత్తిడి వస్తుందని, ఈ నేపథ్యంలోనే ఈనెల 19న రింగ్‌రోడ్డులోని శుభం కళ్యాణమండపంలో అభిమానులతో ఆత్మీయ సమావేశం నిర్వహించి వారి మనోభావాల మేరకు నిర్ణయం తీసుకుంటామన్నారు. వచ్చేఎన్నికల్లో తప్పకుండా ఆరు నియోజకవర్గాల్లో తమ ప్రభావం ఉంటుందని, ఇది ఆపార్టీ నేతలకూ తెలుసన్నారు. సమావేశంలో కార్పొరేటర్ శ్రీవల్లి, మాజీ కార్పొరేటర్లు అడపా కాశీ విశ్వనాథం, సంబరాను వాసు, ఖాజావలి, ఎస్.వీరమణీంద్ర, వీ.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఉపకార వేతనాలు అందచేస్తున్న గోపిచంద్, ఆచార్య సాంబశివరావు తదితరులు

విద్యార్థి దశ మధురమైన జ్ఞాపకం కావాలి

● లక్ష్యసాధనకు నిరంతర కృషి అవసరం : సినీహిరో గోపిచంద్
● అంకుర సంస్థల స్థాపనకు విస్తృత అవకాశాలు: ఆచార్య వజ్జా సాంబశివరావు

గుంటూరు(విద్య),ఫిబ్రవరి17: యువతకు విద్యార్థిదశ ఓమధుర జ్ఞాపకంగా ఉండాలని ప్రముఖ సినీహిరో తొట్టెంపూడి గోపిచంద్ అన్నారు. శనివారం చౌడవరంలోని ఆర్వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల 39వ వార్షికోత్సవం నిర్వహించారు. సినీహీరో గోపిచంద్, ఆయన చిత్రబృందం ఆవేడుకల్లో పాల్గొన్నారు. గోపిచంద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో జోష్ చూస్తుంటే తాను ఇంజనీరింగ్ విద్యను అభ్యసించినప్పటి జ్ఞాపకాలు కళ్ళముందు మెదిలాయన్నారు. విద్యార్థులు నైపుణ్యాలను అందిపుచ్చుకుంటూ లక్ష్యసాధన కోసం కృషి చేయాలని సూచించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీ సలహాదారు ఆచార్య వజ్జా సాంబశివరావు మాట్లాడుతూ విద్యార్థులు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా రాణించాలని, అంకుర సంస్థల స్థాపనకు విస్తృత అవకాశాలున్నాయన్నారు. అనంతరం 277 మంది విద్యార్థులకు, ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున రూ.55.40 లక్షల మెరిట్ స్కాలర్‌షిప్‌లు అంద జేశారు. వివిధకోర్సుల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన 19 మంది విద్యార్థులను ఎంపిక చేసి 1వ, 2వ ర్యాంకులను ప్రకటిస్తూ ఎండోమెంట్ క్యాష్ అవార్డులను అంద జేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు హోరెత్తించాయి. కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష,కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ కొమ్మినేని రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ నార్నె శ్రీనివాసరావు పాల్గొన్నారు.



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

దిక్సూచి DIKSUCHI

ఎంబీఏ



ఐఐటీ జోధ్‌పూర్

జోధ్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీజే)కి చెందిన స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్(ఎస్ఎంఈ)- 'ఎంబీఏ ఇన్ ఫిన్‌టెక్ అండ్ సైబర్ సెక్యూరిటీ' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఈ ప్రోగ్రామ్‌ని రెండు మోడ్‌లలో నిర్వహిస్తున్నారు. మొదటి మోడ్ ప్రకారం- ప్రోగ్రామ్ మొదటి ఏడాది కోర్సుని ఐఐటీజేలోను, రెండో ఏడాది కోర్సును యూఎస్ఏలోని ఎస్‌యూఎన్‌వై అల్బేనీలో చదువుకోవచ్చు. అల్బేనీ విద్యార్థులకు 5000 డాలర్ల స్కాలర్‌షిప్, మూడేళ్ల ప్రాక్టికల్ ట్రెయినింగ్‌కు అనుమతిస్తూ ఎఫ్-1 స్టూడెంట్ వీసా, అల్బేనీ అసిస్టెంట్‌షిప్ అందిస్తారు. ఈ మోడ్‌లో చదివిన వారికి ఐఐటీజే నుంచి 'ఎంబీఏ ఇన్ ఫిన్‌టెక్ అండ్ సైబర్ సెక్యూరిటీ' డిగ్రీ, ఎస్‌యూఎన్‌వై అల్బేనీ నుంచి 'ఎంఎస్ ఇన్ సైబర్ సెక్యూరిటీ అండ్ డిజిటల్ ఫోరెన్సిక్స్' డిగ్రీ లభిస్తాయి. రెండో మోడ్ ప్రకారం ప్రోగ్రామ్ రెండేళ్లూ ఐఐటీజేలోనే చదువుకోవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో బీఈ/బీటెక్/ఎంటెక్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. క్యాట్ 2023/గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. ఎంటెక్ అభ్యర్థులకు ఈ స్కోర్ అవసరం లేదు. విదేశీ అభ్యర్థులకు జీఆర్ఈ/జీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. అభ్యర్థులందరికీ దరఖాస్తు నాటికి ఐటీ/బ్యాంకింగ్/ఫైనాన్షియల్ సర్వీసెస్/ఇన్సూరెన్స్/సైబర్‌సెక్యూరిటీ తదితర విభాగాల్లో కనీసం రెండేళ్ల ఇండస్ట్రియల్ అనుభవం ఉండాలి. ఇంటర్న్‌షిప్‌లు; కోచింగ్ సెంటర్లు, స్మాల్ స్కేల్ బిజినెస్ సంస్థలు, రిటైల్ స్టోర్స్, కిరాణా స్టోర్స్, ఎన్‌జీఓ సంస్థలు, పెట్రోల్ పంప్ సంస్థలు, గ్యాస్ స్టేషన్‌లలో పనిచేయడాన్ని అనుభవం కింద పరిగణించరు.

ఎంపిక: క్యాట్ 2023/గేట్/జీఆర్ఈ/జీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. జాతీయ పరీక్ష స్కోర్/అకడమిక్ మెరిట్, ఇంటర్వ్యూ స్కోర్, అనుభవం, జెండర్ డైవర్సిటీ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 28
- **వెబ్‌సైట్:** iitj.ac.in

ఐఐటీ మండీ

మండీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)కి చెందిన స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఎస్ఓఎం)- ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ స్పెషలైజేషన్ 'డేటా సైన్స్ అండ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్'. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 80 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: రెండు కేటగిరీల్లో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. మొదటి కేటగిరీ అడ్మిషన్స్‌కు సీఎఫ్‌టీఐ గుర్తింపు పొందిన కళాశాల నుంచి బ్యాచిలర్ డిగ్రీ/పీజీ ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు కనీసం 65 శాతం మార్కులు; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 60 శాతం మార్కులు ఉండాలి. వీరికి క్యాట్ వ్యాలిడ్ స్కోర్ అవసరం లేదు. రెండో కేటగిరీ అడ్మిషన్స్‌కు ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 55 శాతం మార్కులు చాలు. అభ్యర్థులందరికీ క్యాట్ 2023 స్కోర్ తప్పనిసరి. రెండు కేటగిరీలకు చెందిన అభ్యర్థులూ ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ బ్యాచిలర్స్ అండ్ మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసినవారికి మొదటి కేటగిరీ కింద ప్రవేశాలు కల్పిస్తారు. ఎన్ఆర్ఐ, విదేశీ విద్యార్థులకు జీమ్యాట్ 2023 స్కోర్ ఉండాలి.

ఎంపిక: మొదటి కేటగిరీ అభ్యర్థులను అకడమిక్ మెరిట్, అనుభవం ఆధారంగా; రెండో కేటగిరీ అభ్యర్థులను క్యాట్ 2023 స్కోర్, అకడమిక్ మెరిట్, అనుభవం ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేస్తారు. తరవాత సెలెక్షన్ కమిటీ నిర్ణయం ప్రకారం ఆన్‌లైన్/పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 26
- **వెబ్‌సైట్:** iitmandi.ac.in

ఆర్మీ ఇన్‌స్టిట్యూట్‌లో ఫ్యాషన్ అండ్ డిజైన్

ఆర్మీ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ సొసైటీ(ఏడబ్ల్యూఈఎస్) బెంగళూరులో నిర్వహిస్తున్న ఆర్మీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ అండ్ డిజైన్(ఏఐఎఫ్‌డీ)- బీఎస్సీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఇందులో ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. ఫ్యాషన్ అండ్ అప్పారెల్ డిజైన్, ఇంటీరియర్ డిజైన్ అండ్ డెకరేషన్ స్పెషలైజేషన్‌లు అందుబాటులో ఉన్నాయి. ఒక్కోదానిలో 60 సీట్లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్‌ని ఆర్మీ విభాగాలకు చెందిన ఉద్యోగులు/విశ్రాంత ఉద్యోగుల పిల్లలకు ప్రత్యేకించారు. రిటెన్ అడ్మిషన్ టెస్ట్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏదేని గ్రూప్‌తో ఇంటర్/ పన్నెండో తరగతి/ తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. తల్లిదండ్రుల్లో ఒకరికి ఆర్మీ ఉద్యోగిగా కనీసం పదేళ్ల సర్వీస్ ఉండాలి.

రిటెన్ అడ్మిషన్ టెస్ట్: దీనిని మొత్తం 100 మార్కులకు నిర్వహిస్తారు. అన్నీ ఆబ్జెక్టివ్ ప్రశ్నలే ఇస్తారు. ఇందులో ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ టెస్ట్, జనరల్ అవేర్‌నెస్ టెస్ట్, ఇంగ్లీష్ లాంగ్వేజ్ కాంపిటెన్సీ అండ్ కాంప్రహెన్షన్ టెస్ట్ ఉంటాయి. ప్రశ్నపత్రాన్ని ఆంగ్ల మాధ్యమంలో ఇస్తారు. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం మూడు గంటలు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.1,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 28
- **వెబ్‌సైట్:** aifd.edu.in

ఐఐపీలో సర్టిఫయిడ్ ప్యాకేజింగ్ ఇంజనీర్



చెన్నైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్(ఐఐపీ)- సర్టిఫయిడ్ ప్యాకేజింగ్ ఇంజనీర్ (సీపీఈ) కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ కోర్సుకు ఏషియన్ ప్యాకేజింగ్ ఫెడరేషన్ (ఏపీఎఫ్) సహకారం అందిస్తోంది. ఇందులో ప్రధానాంశం 'ప్యాకేజింగ్'. ఇంజనీర్లకు ఉద్దేశించిన ఈ ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. వర్కింగ్ ప్రొఫెషనల్స్ కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

ప్రోగ్రామ్ వివరాలు: ఇందులో మూడు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి సెమిస్టర్‌ను జూలై నుంచి అక్టోబరు వరకు, రెండో సెమిస్టర్‌ను నవంబరు నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు, మూడో సెమిస్టర్‌ను వచ్చే ఏడాది మార్చి నుంచి జూన్ వరకు నిర్వహిస్తారు. సాయంత్రం వేళల్లో, వారాంతాల్లో ఆన్‌లైన్ సెషన్స్ ఉంటాయి. మొదటి రెండు సెమిస్టర్లలో కాంటాక్ట్ క్లాసెస్ ఉంటాయి. ప్రాక్టికల్ నాలెడ్జ్ కోసం ల్యాబొరేటరీ డెమాన్‌స్ట్రేషన్స్ నిర్వహిస్తారు. వీటి కోసం అభ్యర్థులు చెన్నై సెంటర్‌లో హాజరు కావాల్సి ఉంటుంది. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. ప్రోగ్రామ్‌లో భాగంగా ల్యాబొరేటరీ విజిట్స్, ఇండస్ట్రియల్ విజిట్స్, కేస్ స్టడీస్, ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. చివరి సెమిస్టర్‌లో నాలుగు నెలల పాటు ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ ఉంటుంది. ప్రతి సెమిస్టర్ చివరలో ఫైనల్ ఎగ్జామ్స్ నిర్వహిస్తారు. ప్రతి పేపర్‌లో కనీసం 40 శాతం, మొత్తమ్మీద 50 శాతం మార్కులు ఉంటేనే సర్టిఫికెట్ ఇస్తారు. ఈ కోర్సు పూర్తిచేసినవారికి ఆటోమొబైల్ సంస్థలు, టెక్స్‌టైల్ హబ్‌లు, ఫైర్‌వర్క్స్ ఇండస్ట్రీలు, ఎఫ్ఎంసీజీ మాన్యుఫాక్చరింగ్ సంస్థల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి మెకానికల్ ఇంజనీరింగ్/ప్రింటింగ్ టెక్నాలజీ/ప్యాకేజింగ్ టెక్నాలజీ/పాలిమర్ ఇంజనీరింగ్/పాలిమర్ టెక్నాలజీ/ఫుడ్ టెక్నాలజీ/బయోటెక్నాలజీ/కెమికల్ ఇంజనీరింగ్/ప్రొడక్షన్ ఇంజనీరింగ్/ప్రొడక్షన్ టెక్నాలజీ/పేపర్ ఇంజనీరింగ్/పేపర్ టెక్నాలజీ/ప్లాస్టిక్స్ టెక్నాలజీ/ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ విభాగాల్లో బీఈ/ బీటెక్ పూర్తిచేసి ఉండాలి. ఇతర విభాగాల్లో ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులై ప్యాకేజింగ్‌పై ఆసక్తి ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.83,190
- **అడ్మిషన్ సమయంలో చెల్లించాల్సిన సెమిస్టర్ ఫీజు:** రూ.35,990
- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.500+18% జీఎస్‌టీ
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 30
- **కాంటాక్ట్ క్లాసెస్ సెంటర్లు:** ముంబై, చెన్నై, ఢిల్లీ, కోల్‌కతా, హైదరాబాద్, అహ్మదాబాద్
- **వెబ్‌సైట్:** www.iip-in.com

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/8yMEdJCలో చదవండి.

ఏఆర్‌వో విశాఖపట్నం పరిధిలో అగ్నివీరులు



విశాఖపట్నంలోని ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీస్.. అగ్నిపథ్ పథకం కింద 2024-25 సంవత్సరం నియామకాలకు సంబంధించి అగ్నివీరుల ఎంపిక కోసం అవివాహిత పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. ఈ నియామకాలకు విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కోనసీమ, అనకాపల్లి, ఏలూరు, ఎన్టీఆర్, కాకినాడ జిల్లాలకు చెందిన అభ్యర్థులు అర్హులు.

కేటగిరీలు:

1. అగ్నివీర్ జనరల్ డ్యూటీ(ఆల్ ఆర్మ్స్)
2. అగ్నివీర్ టెక్నికల్(ఆల్ ఆర్మ్స్)
3. అగ్నివీర్ ఆఫీస్ అసిస్టెంట్/స్టోర్ కీపర్ టెక్నికల్(ఆల్ ఆర్మ్స్)
4. అగ్నివీర్ ట్రేడ్స్‌మన్(టెన్త్ పాస్)(ఆల్ ఆర్మ్స్)
5. అగ్నివీర్ ట్రేడ్స్‌మన్(8వ తరగతి ఉత్తీర్ణత) (ఆల్ ఆర్మ్స్)

వయోపరిమితి: 17 1/2 - 21 సంవత్సరాల మధ్య ఉండాలి. అభ్యర్థి 2003 అక్టోబరు 1 నుంచి 2007 ఏప్రిల్ మధ్య జన్మించి ఉండాలి.

అర్హత: పోస్టును అనుసరించి ఎనిమిదో తరగతి, పదో తరగతి/మెట్రిక్యులేషన్, 10+2/ఇంటర్మీడియట్(ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథ్స్ లేదా ఆర్ట్స్, కామర్స్ సైన్స్), సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.

ఎత్తు(సెం.మీ.లలో): అగ్నివీర్ జీడీ/ట్రేడ్స్‌మన్-166, అగ్నివీర్ టెక్నికల్-165, అగ్నివీర్ క్లర్క్/స్టోర్ కీపర్ టెక్నికల్-162.

ఛాతీ కొలత: గాలి పీల్చినప్పుడు 5 సెం.మీ విస్తరణతో 77 సెం.మీ. ఉండాలి

పరీక్ష ఫీజు: రూ.250


రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: మార్చి 22

ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభం: ఏప్రిల్ 22

వెబ్‌సైట్: joinindianarmy.nic.in

నవ్య | చిత్రజ్యోతి

శివరాత్రికి సిద్ధం




గోపీచంద్ హీరోగా రూపొందుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భీమ' మహాశివరాత్రి సందర్భంగా మార్చి 8న విడుదల కానుంది. 'మరో ఇరవై రోజుల్లో..' అని పేర్కొంటూ శనివారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఫైటింగ్‌కు సిద్ధం అన్నట్లు పోలీస్ యూనిఫామ్‌లో గోపీచంద్ కవ్విస్తున్న ఈ పోస్టర్ ఆకట్టుకుంటోంది. కన్నడ దర్శకుడు ఎ.హర్ష దర్శకత్వంలో కె.కె.రాధామోహన్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ప్రియా భవానీశంకర్, మాళవిక శర్మ హీరోయిన్లుగా నటించారు.

మున్నార్‌లో ముగించారు



నితిన్ కథానాయకుడిగా నటిస్తున్న 'రాబిన్‌హుడ్' చిత్రం మున్నార్‌లో కీలక షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంది. తాజా షెడ్యూల్‌లో చిత్రబృందం పాల్గొనగా కీలకఘట్టాలను తెరకెక్కించారు. టాకీపార్ట్‌తో పాటు నితిన్, ఫైటర్స్‌పై భారీ యాక్షన్ బ్లాక్‌ను చిత్రీకరించారు. త్వరలోనే తదుపరి షెడ్యూల్‌ను ప్రారంభించనున్నట్లు యూనిట్ తెలిపింది. వెంకీ కుడుముల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నితిన్ సరికొత్త పాత్రలో కనిపించనున్నారు. రాజేంద్ర ప్రసాద్, వెన్నెల కిషోర్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.

అమరన్‌గా శివ కార్తికేయన్



తమిళ హీరో శివ కార్తికేయన్ హీరోగా కమల్‌హాసన్ నిర్మిస్తున్న చిత్రానికి 'అమరన్' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు. శనివారం శివ కార్తికేయన్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం టైటిల్‌ను ప్రకటించి, టీజర్‌ను విడుదల చేసింది. ఆర్మీ మేజర్ ముకుందవరదరాజన్ జీవితం ఆధారంగా రాహుల్ సింగ్, శివ్ అరూర్ రాసిన 'ఇండియాస్ మోస్ట్ ఫియర్ లెస్' సిరీస్‌లోని ఓ అధ్యాయం ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహిస్తున్నారు. సాయిపల్లవి కథానాయిక. ప్రస్తుతం చిత్రీకరణ చివరి దశలో ఉంది. వేసవిలో ప్రేక్షకుల ముందుకు వస్తున్న ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: సీహెచ్ సాయి

గ్రామీణ ప్రేమకథ



ప్రేమకు అర్థం చెబుతూ రూపొందిన 'రాధా మాధవం' చిత్రం మార్చి ఒకటిన విడుదల కానుంది. వినాయక్ దేశాయ్, అపర్ణా దేవి జంటగా నటించారు. దాసరి ఇస్సాకు దర్శకత్వంలో గోనాల్ వెంకటేశ్ ఈ సినిమాను నిర్మించారు. 'మా సినిమా సెన్సార్ పూర్తయింది. గ్రామీణ నేపథ్యంలో నిర్మించిన చక్కని సందేశాత్మక చిత్రమని సెన్సార్ సభ్యులు ప్రశంసించారు. ఇటీవల విడుదల చేసిన టైటిల్ సాంగ్, టీజర్, ట్రైలర్‌లకు మంచి స్పందన వచ్చింది. సినిమాపై నమ్మకం పెరిగింది. మార్చి ఒకటిన ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నాం' అని చెప్పారు నిర్మాత. వసంత్ వెంకట్ బాలా కథ, మాటలు, పాటలు అందించిన ఈ చిత్రానికి సతీశ్ లైన్ ప్రొడ్యూసర్

ఒకే పాత్ర.. సామాజిక సందేశం



ఒకే పాత్రతో సామాజిక సందేశంతో రూపొందిన చిత్రం 'నేటి భారతం'. భరత్ పారేపల్లి దర్శకత్వంలో డాక్టర్ యర్రా శ్రీధర్ రాజు నటిస్తూ ఈ సినిమాను నిర్మించారు. త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం ట్రైలర్ విడుదల చేశారు. ఎగ్జిక్యూటివ్ నిర్మాత సాంబేష్ మాట్లాడుతూ 'మంచి సినిమాలు చేయాలని శ్రీధర్ రాజు పరిశ్రమకు వచ్చారు. మొదటి 'మేరా భారత్ మహాన్' సినిమా తీశారు. ఇప్పుడు ఒకే పాత్రతో 'నేటి భారతం' తీశారు. ప్రస్తుత రాజకీయ వ్యవస్థ వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందుల్ని ఈ సినిమా ద్వారా చూపించాం' అని చెప్పారు. కరోనా తర్వాత వచ్చిన ఆర్థిక, సామాజిక స్థితిగతులపై ఈ సినిమా ఉంటుందని నిర్మాత, నటుడు శ్రీధర్ రాజు చెప్పారు. ఇందులో తను జర్నలిస్ట్ పాత్రను పోషించినట్లు తెలిపారు. జర్నలిస్టు అంకిత భావం, తెగింపు ఇందులో చూపించామని చెప్పారు.

టీనేజ్ లవ్ స్టోరీ



ఉదయ్‌రాజ్, వైష్ణవి సింగ్ జంటగా రూపుదిద్దుకున్న చిత్రం 'మధురం2. రాజేశ్ చికిలే దర్శకత్వంలో యం. బంగార్రాజు ఈ సినిమా నిర్మిస్తున్నారు. షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకుని ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. దర్శకుడు చిత్రం గురించి వివరిస్తూ '1990 నేపథ్యంలో జరిగే టీనేజ్ లవ్‌స్టోరీ ఇది. అప్పటి స్కూల్ వాతావరణం, ఆటలు, అల్లర్లు, ఎలా ఉండేవో చూపిస్తున్నాం. ప్రతి ఒక్కరికీ నచ్చేలా ఉంటుంది' అని చెప్పారు. నిర్మాత బంగార్రాజు మాట్లాడుతూ 'కొత్తదనం ఉన్న కథల్ని ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారు. మా సినిమా కూడా కొత్తగా, నేటి తరానికి కనెక్ట్ అయ్యే విధంగా ఉంటుంది. హైదరాబాద్, పాలకొల్లు, ఆచంట, సిద్ధాంతం, రావులపాలెం , కోనసీమ ప్రాంతాల్లో షూటింగ్ చేశాం. సమ్మర్‌లో చిత్రాన్ని విడుదల చేస్తాం' అని చెప్పారు.

అరుదైన వ్యాధితో 'దంగల్' నటి మరణం





ఆమిర్ ఖాన్ నటించిన 'దంగల్'(2016)లో బబిత పాత్రలో నటించిన బాలనటి సుహానీ భట్నాగర్ అరుదైన వ్యాధితో శుక్రవారం కన్నుమూసింది. ఆమె వయసు 19 ఏళ్లు. సుహానీ డెర్మటోమయోసైటీస్ అనే అరుదైన వ్యాధితో బాధ పడుతోంది. స్టెరాయిడ్స్ ఇవ్వడమే దీనికి చికిత్స. కండరాలను బలహీన పరచడం, శరీరంపై రాష్ రావడం ఈ వ్యాధి లక్షణాలు. ఈ వ్యాధి తగ్గడానికి చాలా సమయం పడుతుందని వైద్యులు చెప్పారు. వారి సూచన మేరకు స్టెరాయిడ్స్ తీసుకున్నా, ఆమె లేత శరీరం దానికి తట్టుకోలేక పోయింది. దానికి తోడు ఇన్‌ఫెక్షన్ వచ్చి , లంగ్స్‌లోకి నీరు చేరడంతో సుహానికి శ్వాస తీసుకోవడం కష్టమైంది. అలా బాధ పడుతూనే చివరకు శుక్రవారం సాయంత్రం ఆమె కన్నుమూసిందని సుహానీ తండ్రి పునీత్ సజల నయనాలతో చెప్పారు. 'దంగల్'లో నటించిన తర్వాత కొన్ని యాడ్ ఫిల్మ్‌లో సుహాని నటించింది. 2019లో ఆమె నటనకు దూరం జరిగి చదువు మీద దృష్టి పెట్టింది. ప్రస్తుతం జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ చదువుతోంది. సోషల్ మీడియాకు దూరంగా ఉండే సుహాని చదువు పూర్తయ్యాక మళ్లీ సినిమాల్లో నటించాలనుకుందనీ, అంతలోనే ఇలా జరగడం చూసి తట్టుకోలేక పోతున్నామని ఆమె తల్లి పూజ చెబుతూ ఎమోషనల్ అయ్యారు.



వార్డు మెంబరు శివమ్మ కుటుంబసభ్యులకు కండువా కప్పి పార్టీలోనికి ఆహ్వానిస్తున్న రామాంజనేయులు

టీడీపీ తీర్థం పుచ్చుకున్న వార్డు మెంబరు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 17: మండల పరిధిలోని వంగిపురం గ్రామ 9వ వార్డు మెంబరు వంగిపురపు శివమ్మ తన కుటుంబసభ్యులతో కలిసి తెలుగుదేశం గూటికి చేరారు. శనివారం రాత్రి గ్రామంలో జరిగిన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి బీ రామాంజనేయులు శివమ్మ కుటుంబ సభ్యులకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామానికి వచ్చిన రామాంజనేయులుకు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి తిరిగి తెలుగుదేశం పార్టీ ప్రవేశ పెట్టబోయే పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో గింజుపల్లి వెంకటేశ్వరరావు, సర్పంచ్ శిఖా విజయలక్ష్మి, నవీన్, పుష్పాళ్ల రామ్మోహన్, ఎంపీటీసీ పాలేటి సాంబశివరావు, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వానపాముల ఎరువుల తయారీపై శిక్షణ



వానపాము ఎరువుల తయారీపై శిక్షణ సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న యుగంధర్

లాంఫాం(తాడికొండ), ఫిబ్రవరి 17: గ్రామీణ యువతీ, యువకులు ఆర్థికంగా స్థిరపడాలనే ఉద్దేశంతో ఎరువుల తయారీపై శిక్షణ ఇస్తున్నట్లు కేవీకే సీనియర్ శాస్త్రవేత్త ఎం యుగంధర్‌కుమార్ అన్నారు. లాంఫాంలోని కేవీకేలో విలువ ఆధారిత వానపాముల ఎరువు తయారీపై గ్రామీణ యువతీ, యువకులకు 6రోజుల శిక్షణ కార్యక్రమం ముగింపు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వానపాముల ఎరువు తయారీ, వర్మీవాష్ షెల్ నిర్మాణం, నాబార్డ్, ఎల్‌డీఎం బ్యాంకుల మేనేజర్లు, యూనిట్ నిర్మాణానికి అవసరమైన ఆర్థికాంశాలు వివరించారు. శిక్షణ అనంతరం యువతీ, యువకులకు సర్టిఫికెట్లు, కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీరామాంజనేయులు, కోర్సు డైరెక్టర్ ఎం గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఓబీసీ చైర్మన్‌గా రంగనాథ్

మంగళగిరి, ఫిబ్రవరి 17: రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఓబీసీ చైర్మన్‌గా మంగళగిరికి చెందిన పరసా రంగనాథ్‌ను నియమించారు. ఢిల్లీ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు కేంద్ర సామాజిక సాధికారిక న్యాయ శాఖామంత్రి రామ్‌దాస్ అథవాలే సమక్షంలో పార్టీ జాతీయ కార్యదర్శి పేరం శివనాగేశ్వరరావు రంగనాథ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. రంగనాథ్ మాట్లాడుతూ ఓబీసీల సమస్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం ప్రయత్నిస్తానన్నారు.

బీసీల స్థితిగతులను మార్చిన టీడీపీ

● మాజీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్



జయహో బీసీ సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్

మేడికొండూరు, ఫిబ్రవరి 17: కులవృత్తులు, అరకొర పనులతో జీవిస్తున్న బీసీల స్థితిగతులను మార్చింది తెలుగుదేశమేనని పార్టీ జిల్లా అధ్యక్షుడు, తాడికొండ మాజీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ చెప్పారు. మేడికొండూరు మండలంలోని పేరేచర్లలో శనివారం రాత్రి జరిగిన సభకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. తొలుత ఎన్‌టీ రామారావు, ఆ తరువాత చంద్రబాబునాయుడు బీసీల అభ్యున్నతికి అనేక పథకాలు తీసుకువచ్చి అమలు చేశారని, వైసీపీ అధికారంలోకి వచ్చాక వారిని అణగదొక్కారని తెలిపారు. రాష్ట్ర జనసేనపార్టీ ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ బీసీలకు తీవ్ర అన్యాయం చేసిన వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని టీడీపీ, జనసేన పార్టీలను భారీ మెజార్టీతో గెలిపించాలని చెప్పారు. ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి బీసీలకు తీరని ద్రోహం చేశారని మండిపడ్డారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు. డాక్టర్ నిమ్మల శేషయ్య మాట్లాడుతూ సమాజానికి నాగరికత నేర్పింది బీసీలేనని, నాలుగేళ్లుగా బీసీలకు ద్రోహం జరుగుతున్నా బీసీలలో ఐక్యత లేకపోవడం వల్ల ఆత్మగౌరవాన్ని పోగొట్టుకోవాల్సి వచ్చిందని అన్నారు. అధికారం వైసీపీ బీసీ నాయకులను మోకాళ్లపై కూర్చోబెట్టడం, దాడులు చేసి హతమార్చడం చేస్తున్నదని ఆరోపించారు. రాష్ట్ర మేదర సంఘం కన్వీనర్ ఏసు బాబు మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్‌లో పెట్టి బీసీ లకు ఎటువంటి పథకం అందకుండా చేసి జగన్ రెడ్డి తీరని అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. రాష్ట్ర వడ్డెర సంఘం ప్రధాన కార్యదర్శి మల్లెల ఈశ్వరరావు మాట్లాడుతూ చంద్రన్న బీమా పథకం వల్ల చేతివృత్తుల్లో ప్రాణాలు కోల్పోయిన అనేక బీసీ కుటుంబాలకు ఎంతో ప్రయోజనం చేకూరిందని, అటువంటి పథకాన్ని నాలుగున్నర ఏళ్లుగా సీఎం జగన్మోహన్‌రెడ్డి నిలిపివేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర నాయకులు గుంటుపల్లి నాగేశ్వరరావు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ బీసీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీరంకి గురుమూర్తి, జోన్ 3 విభాగం కో ఆర్డినేటర్ తమ్మిశెట్టి రమాదేవి, తాడికొండ నియోజకవర్గం జనసేన నాయకులు బేతపూడి విజయ్ శేఖర్, బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు రాఘవేంద్ర జిల్లా నాయకుడు వేములకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక సమస్యలు లేకుండా చూడాలి

● అధికారులకు కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి ఆదేశం

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 17: జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో ఎలాంటి సాంకేతిక పరమైన సమస్యలు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రత్తిపాడు సచివాలయం 3 వద్ద ఏర్పాటు చేసిన పాలసేకరణ కేంద్రాన్ని కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డితో పాటు జేసీ రాజకుమారి లు పరిశీలించారు. ఈ సందర్భంగా పాలు పోయడానికి వచ్చిన వారి పేర్లు ఆన్‌లైన్లో నమోదు కాని విషయం ఆయన దృష్టికి వచ్చింది. దీనిపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ముందుగా ఎందుకు పేర్లు నమోదు చేయలేదంటూ అధికారులను ప్రశ్నించారు. సాంకేతిక పరమైన సమస్యల కారణంగా ఆన్‌లైన్లో పేర్లు కనిపించడం లేదని అధికారులు తెలిపారు. అనంతరం గుంటూరు నుంచి వెబ్ కాన్ఫరెన్స్ ద్వారా మండల అధికారుకు కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి స్పెషల్ క్లాస్ తీసుకున్నట్లు తెలిసింది.

ఏపీజేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘాల ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఏపీ జేఏసీ నాయకులు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 17: ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘాలు ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించాయి. పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు, ఓపీఎస్ అమలు చేయడంతో పాటు ఐఆర్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం వద్ద పలు ఉద్యోగ సంఘాల నాయకులు నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు జేఏసీ అధ్యక్షుడు అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్య నియామకాల్లో అప్రెంటిషిప్ ఆలోచనా విధానాన్ని విడనాడాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ సభ్యులు వెంకటరెడ్డి, షకీలా బేగం, శ్వేత, జ్యోతి, కే ప్రేమ్‌కుమార్,సుధ, ఆంథోని తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలి

● ఎంఈవో కెన్నడీ



ప్రాథమిక పాఠశాలలో మాట్లాడుతున్న ఎంఈవో కెన్నడీ

కాకుమాను, ఫిబ్రవరి 17: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాశాఖాధికారి కేఎఫ్ కెన్నడీ సూచించారు. మండలపరిధిలోని అప్పాపురంలో ప్రాథమిక పాఠశాలలను వార్షిక తనిఖీ నిర్వహించారు. పాఠశాలల్లో రికార్డులు, విద్యార్థుల హాజరు గురించి వాకబు చేశారు. అలాగే పాఠశాలల్లో విద్యార్థుల మధ్యాహ్న భోజనాన్ని ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షించాలని అలాగే ప్రతి విద్యార్థి పాఠశాల్లోనే భోజనం చేయాలన్నారు. విద్యార్థుల సంఖ్య తగ్గిన పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 కెన్నడీ, హెచ్‌ఎం షాహనాజ్‌బేగం, సాల్మన్‌రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

దుగ్గిరాల, ఫిబ్రవరి 17: మండలంలోని ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న ముగ్గురికి నగదు చెక్కులను శనివారం అందించారు. మంచికలపూడి గ్రామానికి చెందిన నరిశెట్టి రంగారావుకు రూ.60వేలు, పేరుకలపూడి చెందిన నల్లగొర్ల శంకరరావుకు రూ.65వేలు, రేవేంద్రపాడుకు చెందిన రుక్షానాకు రూ.40వేల చెక్కును అందించారు. ఎమ్మెల్సీ హనుమంతరావు, ఆప్కోచైర్మన్, వైసీపీ ఇన్‌చార్జి గంజి చిరంజీవి, ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జడ్పీటీసీ మేకతోటి అరుణకు మారి, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణం పరిరక్షణ అందరి బాధ్యత

● మొదటి అదనపు జిల్లా జడ్జి రాజగోపాలరావు



మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న న్యాయమూర్తులు

మంగళగిరి, ఫిబ్రవరి 17: పర్యావరణం పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని గుంటూరు మొదటి అదనపు జిల్లా జడ్జి సీహెచ్ రాజగోపాలరావు అన్నారు. శనివారం మంగళగిరి న్యాయస్థానాలను సందర్శించిన ఆయన కోర్టు ఆవరణలో మామిడి మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం వల్ల పర్యావరణాన్ని రక్షించిన వారు అవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి వై నాగరాజ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్‌వి రామకృష్ణ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీప్రత్యూష, బార్ అసోసియేషన్ అధ్యక్షులు జె లెనిన్‌బాబు, ఉపాధ్యక్షులు సత్యాల బాలశౌరి, తోట నరసింహారావు, న్యాయవాదులు జవ్వాది విజయకుమార్, తాడిశెట్టి మురళి, కె స్వరూపరాణి, వి.భారతి, సీహెచ్ శ్రీధర్, హేమ పాల్గొన్నారు.

రేపు వార్షిక కల్యాణం

కాకుమాను, ఫిబ్రవరి 17: కాకుమానులో ఉన్న గంగా పార్వతి సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో స్వామి వార్షిక కల్యాణం జరుగుతుందని ఆలయ కార్యనిర్వాహణ అధికారి అశోక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు జరుగుతాయని భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు


నిందితుడి అరెస్టు చూపించి మాట్లాడుతున్న డీఎస్పీ ఎం రమేష్

మహిళ హత్యకేసులో నిందితుడి అరెస్టు

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి17: ఓ మహిళకు గడ్డిమందు తాగించి హత్య గావించిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. తెనాలి డీఎస్పీ ఎం.రమేష్ శనివారం తెనాలి అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో నిందితుడి అరెస్టు చూపించి కేసు వివరాలను వెల్లడించారు. మండల పరిధిలోని మన్నవ గ్రామానికి చెందిన దమ్ము సునీతకు అదే గ్రామానికి చెందిన సమీప బంధువు వంశీతో వివాహేతర సంబంధం ఉంది. వారిద్దరి మధ్య ఏర్పడిన ఘర్షణ అనంతరం సునీత వంశీతో వివాహేతర సంబంధం కొనసాగించటానికి నిరాకరించింది. దీంతో వంశీ ఆమెపై కక్ష పెంచుకున్నాడు. ఈ నెల 13న సునీత పట్టణంలో తన తల్లి వద్దకు వచ్చింది. ఆమెతో మాట్లాడేందుకు వంశీ ప్రయత్నించగా నిరాకరించింది. దీంతో ముందుగా వేసుకున్న పథకం ప్రకారం తాను తీసుకొచ్చిన గడ్డిమందును సునీత చేత బలవంతంగా తాగించి పరారయ్యాడు. వెంటనే సునీతను ఆమె బంధువులు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అనంతరం సునీత 14వ తేది చికిత్స పొందుతూనే సునీత మృతి చెందింది. సునీత వాంగ్మూలం మేరకు వంశీపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని శనివారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో అర్బన్ సీఐ పీ.ప్రభాకర్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జెట్టి శ్రీధర్

న్యాయ విజ్ఞాన సదస్సు

● లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై ఉద్యోగులకు అవగాహన

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 17 : మండల పరిషత్ కార్యాలయంలో శనివారం లైంగిక వేధింపుల నిరోధక చట్టం గురించి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీధర్ మాట్లడుతూ మహిళా ఉద్యోగులను శారీరక, లైంగిక ప్రయోజనాల కోసం పురుష ఉద్యోగులు వేధించినా, అశ్లీల చిత్రాలు చూపినా, వ్యాఖ్యలు చేసినా, లైంగిక వేధింపుల కింద పరిగణింబడుతుందని తెలిపారు. పని ప్రదేశాలలో అంతర్గత ఫిర్యాదుల కమిటీలను ఏర్పాటు చేసేందుకు, ఫిర్యాదులు దాఖలు చేసేందుకు ఈ చట్టం విధివిధానాలు రూపొందించిందన్నారు. కార్యక్రమంలో తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.వేణుగోపాలరావు, ఎంపీడీవో కాటూరి శిల్ప, మెహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పోలీసుల నోటీసులు

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి17: ఛలో విజయవాడ కార్యాక్రమానికి తరళివెళ్లకుండా పొన్నూరు పట్టణంలోని ఉపాధ్యాయ సంఘాల నాయకులకు పోలీసులు శనివారం ముందస్తు నోటీసులు జారీ చేసారు. విజయవాడలో తలపెట్టిన ఈ నిరసన కార్యక్రమానికి అనుమతులు లేవని వెళ్లటానికి వీలు లేదన్ని నోటీసులు జారీ చేసారు. నోటీసులు అందకున్న పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యహితంగా తమ సమస్యలపై పోరాడుతుంటే ప్రభుత్వం తమపై ఉక్కుపాదం మోపుతుందని ఆరోపించారు. ఇచ్చిన హామీని అమలు చేయమంటే ఎందుకు నిరంకుశత్వ వైఖరిని అవలంబిస్తుందని నిలదీసారు. ప్రభుత్వం ఇప్పటికైన స్పందించి ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.


ఏపీటీఎఫ్ నాయకుడికి నోటీసు అందచేస్తున్న పోలీసు


భౌతికకాయానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న నరేంద్ర కుమార్

మృతులకు నరేంద్ర కుమార్ నివాళి

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి17: మృతులకు మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ శనివారం నివాళ్లు అర్పించారు. మండల పరిధిలోని ఉప్పరపాలెం గ్రామానికి చెందిన మోసూరి వెంకట రమణ మృతి చెందగా ఆమె మృతదేహాన్ని సందర్శించిన నరేంద్ర కుమార్ నివాళులు అర్పించారు. వెంకట రమణ భర్త, కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేసారు. అలాగే సీతరామపురం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త పాలడుగు అవయ్య ఇటీవల మృతి చెందారు. అనవయ్య గృహానికి వెళ్లిన నరేంద్ర కుమార్ మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొర్రు రామారావు, బండ్లమూడి బాబురావు, మందూరి నవీన్ తదితరులు పాల్గొన్నారు.


సమస్యలు పరిష్కరించాలని ధర్నా నిర్వహిస్తున్న ఐక్యకార్యాచరణ సమితి సభ్యులు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి17: రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు పెన్షనర్లు సమస్యలను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని ఏపీ ఐక్య కార్యాచరణ సమితి పొన్నూరు యూనిట్ సభ్యులు డిమాండ్ చేసారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేసారు. అలాగే ఉద్యోగులకు మధ్యంతర భృతిని 30 శాతంగా అందచేయాలన్నారు. పీఎఫ్, రుణాలు ఫైల్స్‌ను తక్షణమే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు ఎన్.శ్రీనివాసరావు, ఎస్.ప్రసాదరావు, జీ. శ్రీనివాసరావు, ఎన్.శివ ప్రసాద్, ఆరేటి రామారావు, ఎంఎం ఖుద్దూస్, తదితరులు పాల్గొన్నారు.

వీవీఐటీలో 'వైర్ లెస్ నెట్వర్క్స్'పై సదస్సు.

పెదకాకాని, ఫిబ్రవరి17: వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఐఈటీఈ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో త్వరితవేగంగా వైర్లెస్ నెట్ వర్క్స్ సేవలు అందించడంపై శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ముఖ్యవక్తగా హాజరైన స్వీడన్‌కు చెందిన ఎరిక్సన్ సంస్థ రీసెర్చ్, డవలపర్ గుంటుపల్లి లక్ష్మీకాంత్ విద్యార్థులకు సమాచార లోపాలు,కమ్యునికేషన్ ప్రాముఖ్యతను వివరించారు. సెల్యులర్ కమ్యూనికేషన్స్ జెనరేషన్స్ మధ్య వ్యత్యాసాన్ని తెలియజేశారు. కమ్యునికేషన్స్‌లో ఎక్కువగా జరిగే కాల్‌డ్రాప్స్ ట్రాఫిక్ కంట్రోల్, అలాగే కమ్యునికేషన్స్ మధ్య జాప్యం ఏవిధంగా జరుగుతుందో వివరించారు.


అవగాహన సదస్సులో పాల్గొన్న వీవీఐటీ విద్యార్థులు, అధ్యాపకులు

చంద్రబాబుతోనే సంక్షేమం, అభివృద్ధి

● అన్నివర్గాలవారిని నమ్మించి ముంచిన జగన్‌రెడ్డి
● మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్
● పట్టణంలోని 17వ వార్డులో పార్టీ శ్రేణులతో సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి రూరల్, ఫిబ్రవరి 17: అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని తిరిగి గాడిలోపెట్టి అభివృద్ధి, సంక్షేమం వైపు నడిపించే సత్తాకలిగిన నాయకుడు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడని ఆయన సీఎంగా పాలన సాగిస్తేనే ప్రజలందరికి మంచి జరుగుతుందని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ చెప్పారు. శనివారం పట్టణంలోని 17వ వార్డులో బీసీ నాయకుడు గిరి గణేష్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలపాటి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం అందించామని వైసీపీ గొప్పలు చెబుతుందనీ, ఆ పార్టీ దృష్టిలో అభివృద్ధి అంటే వాడవాడలా మద్యాన్ని ఏరులై పారించడం, సంక్షేమమంటే భూములు, ఇసుక, మట్టి వంటి ప్రకృతి సంపదను దోచుకుకోవడమని విమర్శించారు. వైసీపీ నాలుగు సంవత్సరాల ఎనిమిది నెలల పాలనా కాలంలో రోడ్లు బాగులేక ప్రమాదాల బారినపడి ఎందరో ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం వేయించిన రోడ్లు మినహా ఎక్కడైనా కొత్తరోడ్లు వేయించిన దాఖలాలు నియోజకవర్గంలో ఎక్కడైనా ఉన్నాయా అని ప్రశ్నించారు. సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలుచేస్తానని నమ్మబలికి మహిళల ఓట్లు కొల్లగొట్టి అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి తర్వాత ప్రభుత్వ మద్యం షాపులు పెట్టి, మద్యం ద్వారా వచ్చిన ఆదాయాన్నే రాష్ట్ర ప్రధాన ఆర్థికవనరుగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఎస్ రద్దు చేస్తానని ఉద్యోగులకు ఇచ్చిన మాట ఏమైందన్నారు. నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ద్వారా ఉద్యోగాలు తేస్తానన్న జగన్ చివరికి జాబ్‌లెస్ క్యాలెండర్ విడుదల చేసి నిరుద్యోగులను ఉసూరుమనిపించాడని మండిపడ్డారు. అన్నదాతలందరికి అండగా ఉంటూ వ్యవసాయాన్ని పండుగ చేస్తానన్న జగన్ ఇప్పుడు అదే రైతుల చేత వ్యవసాయం దండుగంటూ క్రాప్ హాలీడేస్ ప్రకటించే పరిస్థితికి వారిని దిగజార్చారని దుయ్యబట్టారు. ఇసుక పారదర్శక విధానమన్నాడు.. భవన నిర్మాణ రంగ కార్మికుల కన్నీటికి కారకుడయ్యాడన్నారు. రాష్ట్రం బాగుండాలన్నా, ప్రజలందరూ సంతోషంగా ఉండాలన్నా, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందాలన్నా, మహిళలకు సంక్షేమం అందాలన్నా టీడీపీ-జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావాలని, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని అన్నారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ కల్పిస్తూ చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన టీడీపీ, జనసేన ఉమ్మడి మినీ మేనిఫెస్టోను పార్టీశ్రేణులు ఇంటింటా ప్రచారం చేయాలన్నారు. టీడీపీ, జనసేన ఉమ్మడి కూటమి గెలుపు రాష్ట్రానికి ఎంత అవసరమో ప్రజలందరికి తెలిపి బాబు ష్యూరిటీ బాండ్లను అందించాలని కోరారు. పట్టణ, మండల అధ్యక్షులు తాడిబోయిన హరిప్రసాద్, కేసన కోటేశ్వరరావు, పెద్దసంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ప్రదర్శన చేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు

పట్టణంలో ఏపీ జేఏసీ ఉద్యోగుల ర్యాలీ

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 17: ఏపీ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు శనివారం పట్టణంలో ఎన్జీవో కార్యాలయం నుంచి ధర్నా చౌక్ వరకు ప్రదర్శన నిర్వహించారు. చినరావూరు పార్కు ధర్నా చౌక్ వద్ద తెనాలి ఎన్జీవో యూనిట్, జేఏసీ చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల వేతనాలను ప్రతినెలా 1వ తేదీన చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలన్నారు. డీఏ, పీఆర్సీ బకాయిలు చెల్లించాలని, సరండర్ లీవ్ బిల్లులు పాస్‌చేయాలని, ఉద్యోగుల పీఎఫ్ ఖాతాల్లో దాచుకున్న సొమ్ముకుచేసిన రుణ దరఖాస్తులకు బ్యాంకుల్లో నగదు జమ చేయాలని, మెడికల్ బిల్లులను తక్షణమే చెల్లించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే సమ్మెకైనా వెనుకాడేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నేతలు కృష్ణమోహన్, విద్యాసాగర్, రామకృష్ణమూర్తి, రామచంద్రయ్య, సుబ్బారావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అన్న క్యాంటీన్‌లు

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 17: మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో తెనాలి పట్టణంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ సేవలు కొనసాగుతున్నాయి. స్థానిక మార్కెట్ సెంటరులోని అన్నక్యాంటీన్‌లో శనివారం ఎన్నారై విద్యా సంస్థల యాజమాన్యం సహకారంతో, శివాజిచౌక్‌లో అన్నక్యాంటీన్‌లో ఆలపాటి రాజా దంపతుల సహకారంతో పేదలకు ఆహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు వెనిగళ్ళ శివప్రసాద్, గోగినేని రమేష్, కొత్తపల్లి రమేష్, కోటేశ్వరరావు, సాంబశివరావు, ప్రసాద్, వెంకట్, వెంకటేశ్వరావు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జాతీయ మహిళా మోర్చా కార్యదర్శిగా దీపిక

కొల్లిపర, ఫిబ్రవరి 17 : జాతీయ మహిళా మోర్చా కార్యాలయం కార్యదర్శిగా కొల్లిపరకు చెందిన ఆరిమండ దీపిక నియమితులయ్యారు. ఆమె నియామకంపై బీజేపీ కొల్లిపర మండల నేతలు శనివారం హర్షం వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చందు సాంబశివరావు, జిల్లా ఉపాధ్యక్షురాలు రెడ్డి శివపార్వతీ, మండల అధ్యక్షుడు మునగాల కృష్ణమూర్తి, మండల ఉపాధ్యక్షుడు అశ్వనీకుమార్, మండల కార్యదర్శి మంద్రు మురళి, తదితరులు ఆరిమండ దీపికకు అభినందలను తెలిపారు.


విద్యార్థుల నృత్యప్రదర్శనలు

క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలు సాధించాలి

● భాష్యం కల్చరల్ ఫెస్ట్‌లో డాక్టర్ రమణ యశస్వి

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 17: పట్టుదల, క్రమశిక్షణ, ఏకాగ్రత ఉంటే ఎంతటి లక్ష్యాన్నైనా సునాయాసంగా సాధించవచ్చని ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రమణ యశస్వి అన్నారు. శనివారం భాష్యం ఐఐటి ఫౌండేషన్ అకాడమీ ఆధ్వర్యంలో భాష్యం రామసేతు క్యాంపస్‌లో 'తరంగ్ ది వేవ్' పేరిట కల్చరల్ ఫెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ రమణ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతూ జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకోవాలన్నారు. డైరెక్టర్ భాష్యం హనుమంతరావు, రామసేతు ప్రిన్సిపాల్ షఫీ, భాష్యం ఐఐటీ ప్రోగ్రామర్ ఆనంద్ కుమార్, ఆయుర్వేద వైద్యులు కొండా వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

చేబ్రోలు, ఫిబ్రవరి17: చేబ్రోలులో శనివారం పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ప్రారంభించారు. పాతరెడ్డిపాలెం, కొత్తరెడ్డిపాలెం, సచివాలయాలు అంతర్గత రహదారులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి వివరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

20 నుంచి ఆంజనేయస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 17 : స్థానిక షరాఫ్ బజారులోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 20 నుంచి జరుగుతాయని ప్రధాన అర్చకులు ఆర్.శ్రీనివాసమూర్తి తెలిపారు. శనివారం ఆలయ ప్రాంగణంలో బ్రహ్మోత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. 20న అంకురారోపణ, ధ్వజారోహణ, 21న సీతారాముల కళ్యాణం, 22నస్వామి అమ్మవార్లకు సూర్యప్రభ, చంద్రప్రభ వాహన సేవలు, 23న మైనాక వాహన సేవ, 24 రథోత్సవం, 25న పూర్ణాహుతి, 26న పుష్పోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి.

యూహెచ్‌సీలో రోగ నిర్ధారణ పరీక్షలు

● రోగులకు పండ్లు పంపిణీ

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి17: స్థానిక కొత్తపేటలోని పాత ప్రభుత్వ ఆస్పత్రిలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో శనివారం హ్యూమన్ రైట్స్ ఆఫ్ ఇండియా కోస్తాంధ్ర అధ్యక్షుడు పల్నాటి నాగరాజు ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, బ్రెడ్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ అర్బన్ సెంటరులో రోగులకు 64 రకాల రోగ నిర్ధారన పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. ఎంవోగా పనిచేస్తున్న డాక్టర్ బీబీ జాన్ రోగులకు రోగ నిర్ధారణ పరీక్షలు చేసి మందులను పంపిణీ చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నారాయణ కళాశాల ప్రిన్సిపాల్ పవన్‌కుమార్, నన్నపనేని సునీల్, హ్యూమన్ రైట్స్ సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రంలో రికార్డుల పరిశీలన

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 17: పట్టణంలోని పినపాడు వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్‌ను శనివారం తెనాలి యుఎల్‌బీ విస్తరణాధికారి అందె చంద్రమౌళి సందర్శించి, ల్యాబ్ రికార్డులను పరిశీలించి తగిన సూచనలను చేశారు. ఈ సందర్భంగా చంద్రమౌళిమాట్లాడుతూ ల్యాబ్ టెస్టుల ఫలితాలే వ్యాధుల చికిత్సలకు మూలమని, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ, ప్రభుత్వవైద్యశాలలో అన్ని టెస్టులు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ఈసౌకర్యాన్ని ఉపయోగించుకొని ఉచితంగా పరీక్షలు చేయిం చుకోవాలని, అవసరమైన మందులను ఉచితంగా పొందవచ్చునని తెలిపారు. పట్టణంలోని మారీసుపేట, పద్మశాలిపేట, సుల్తానాబాద్, గంగానమ్మపేట, నందులపేటలోని ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కలవని ప్రజలు ఈ కేంద్రాలలోని వైద్య సేవలను వినియోగించుకోవాని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మారీసుపేట ల్యాబ్ టెక్నీషియన్ కోట కమలాకర్ గుప్తా పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న ఆరోగ్య విస్తరణాధికారి చంద్రమౌళి

భవనారాయణస్వామి ఆలయ ఏసీగా పానకాల రావు

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి17: పొన్నూరు పట్టణంలోని సుందర్లీ రాజ్యలక్ష్మీ సమేత సాక్షి భవనారాయణ స్వామి ఆలయ అసిస్టెంట్ కమిషనర్‌గా ఎం .పానకాల రావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. బాపట్ల జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వ హిస్తున్న పానకాలరావు బదిలీపై పొన్నూరు వచ్చారు. ఆలయ ఏసీగా పనిచేసిన ఆర్ రమణమ్మ డిప్యూటీ కమిషనర్‌గా ఉద్యోగోన్నతి పొంది శ్రీశైలం దేవస్థానానికి బదిలిపై వెళ్లారు.

వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిరూరల్, ఫిబ్రవరి 17: తెనాలి వ్యవసాయ మార్కెట్‌యార్డు అభివృద్ధికి కృషిచేస్తున్నట్లు ఎమ్మెల్యే శివకుమార్ తెలిపారు. శనివారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆధునీకీకరణలో భాగంగా ప్రధానద్వారంవద్ద ఏర్పాటు చేయనున్న ఎద్దుల బండి విగ్రహ నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ పాలకమండలి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం.. రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఉత్తమ వలంటీర్లుగా అవార్డులు పొందిన వారిని ఎమ్మెల్యే సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వలంటీర్ల కృషిని కొనియాడారు.

శనివారం పట్టణంలోని 11,12వ వార్డులలో కౌన్సిలర్లు, నేతలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులు, బీఎల్‌ఏలతో ఎమ్మెల్యే శివకుమార్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో అనుసరించాల్సిన విధి విధానాలపై చర్చించారు.


మార్కెట్ యార్డులో పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే


ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

డ్రెయినేజీ సమస్యలను వెంటనే పరిష్కరిస్తాం

● పట్టణ మునిసిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి17: పట్టణంలోని డ్రెయినేజీ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని పట్టణ మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. పట్టణంలోని మూడవ వార్డులో శనివారం పారిశుధ్య పనులను ఆమె పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు చెత్తను మురుగు కాల్వలో పోయరాదని, శానిటరీ కార్మికులకు అందించాలని కోరారు. ఈ వార్డులో ఎక్కువ ఖాళీ స్థలాలు ఉండటం, పందికొక్కులు ఆస్థలాల్లో మట్టిని తవ్వడంతో డ్రెయినేజీ కాల్వలు పుడుకు పోతున్నాయని అన్నారు. ఈ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆవుల కోటయ్య, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ హెలెన్ నిర్మల, ఆర్ఐ మోహన్ కృష్ణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, కుమార్ సచివాలయ సిబ్బంది, మున్సిపల్ ఎలక్ట్రికల్, గ్రీనరి సిబ్బంది, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పెళ్లికానుక అందజేత

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి: నియోజకవర్గంలోని తెలుగింటి ఆడపడుచుల వివాహానికి మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మంగళసూత్రం లేదా బంగారు ఉంగరం కానుకగా అందిస్తున్నారు. శనివారం మండల పరిధిలోని అంగలకుదురు గ్రామంలో పోశం ఆంజనేయులు, లక్ష్మీపార్వతిల కుమార్తె లక్ష్మీ దుర్గ వివాహం సందర్భంగా గ్రామ టీడీపీ నేతలు వధువుకు బంగారు మంగళసూత్రం, చీర, శారెలను అందించి ఆశీర్వదించారు. కార్యక్రమంల్లో శ్రీనివాసరావు, ఉసరపు రాజ్యలక్ష్మి, మాజీ ఎంపీపీ వెంకట్రావు పాల్గొన్నారు.